వదులుకుంటారా..
వాటా ఇస్తారా..!

- మద్యం దుకాణం తెరిచారా.. తస్మాత్..!
- లైసెన్సుదారులకు రాజకీయ బెదిరింపులు
- ఎనిమిది రోజులైనా తెరుచుకోని పలు దుకాణాలు
- ఎక్సైజ్ ఉన్నతాధికారులు సీరియస్
- తలనొప్పిగా మారిన నేతల ఒత్తిళ్లు
- దుకాణదారులకు నోటీసులు





ఇసుక, మద్యం వ్యవహారాల్లో తలదూర్చొద్దని ముఖ్య మంత్రి చంద్రబాబు గట్టి హెచ్చరికలు జారీచేసినా.. కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు ఖాతరు చేయట్లేదు. తమ దోవ తమదే అంటున్నారు. ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటులో ఖద్దరు దౌర్జన్యం మితి మీరిందన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. మద్యం దుకాణం తమకే అప్పగించాలనీ, లేదంటే వాటా అయినా ఇవ్వాలంటూ లైసెన్సుదారులను బెదిరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పటిదాకా దుకాణాలు పెట్టనీయడం లేదని తెలుస్తోంది. ఒకవేళ ఏర్పాటు చేసినా దౌర్జన్యాలకు దిగుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాలు ప్రారంభించి వారం దాటినా జిల్లాలో ఇప్పటికీ ఎనిమిది దుకాణాలు తెరుచుకోలేదు. పెనుకొండ, ధర్మవరం నియోజకవర్గాల్లోనే నాలుగు దుకాణాలు ప్రారంభం కాకపోవడం చర్చనీయాంశమైంది. ఒకట్రెండు చోట్ల దుకాణాల ఏర్పాటుకు స్థలం దొరకలేదు. మరికొన్నింటిపై రాజకీయ ఒత్తిళ్లు, రెండుచోట్ల ఒకే కుటుంబానికి దుకాణాలు దక్కిన నేపథ్యంలో ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది. లాటరీలో అదృష్టం వరించిన లైసెన్సుదారులు ఎక్కడున్నారో తెలియదని ఎక్సైజ్ శాఖ పేర్కొంటుండడం గమనార్హం.

- పుట్టపర్తి, ఆంధ్రజ్యోతి

సాహసించని ఎక్సైజ్ శాఖ

జిల్లాలో 87 మద్యం దుకాణాల ఏర్పాటుకు లాటరీ తీశారు. వాటిని దక్కించుకున్న వారు అన్నింటికీ లైసెన్సు ఫీజు చెల్లించారు. ఇందులో 82 దుకాణాలకు డిపో నుంచి మద్యం కొనుగోలు చేస్తున్నారు. అమ్మకాలు మాత్రం 79 దుకాణాల్లోనే సాగుతున్నాయి. లైసెన్సు ఫీజు చెల్లించి ఎందుకు దుకాణాలు ప్రారంభించలేదంటూ ఎక్సైజ్ శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు.. జిల్లా యంత్రాంగంపై ఒత్తిళ్లు తెస్తున్నారు. తమకు తెలియకుండా దుకాణాలు ప్రారంభిస్తే స్టేషన్, జిల్లా సరిహద్దులు దాటించేస్తామనీ, ఇబ్బంది వస్తే తాము చూసుకుంటామంటూ ప్రజాప్రతినిధులు చెప్పారంటూ నేతలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. చేసేదిలేక దుకాణాలు ప్రారంభించాలంటూ నోటీసులు జారీ చేసి, తప్పించునే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో దుకాణాలు ప్రారంభించని వారికి నోటీసులు జారీ చేశారు.

- హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధి పరిగిలో 58., 59 దుకాణాలున్నాయి. వీటిలో ఒకటి పరిగి మండల వాసికి దక్కింది. మరొకటి కర్ణాటక ప్రాంతానికి చెందిన మద్యం వ్యాపారి వశమైంది. ఈరెండింటికి లైసెన్సు ఫీజు చెల్లించారు. ప్రారంభానికి అనుమతి కూడా దక్కింది. రాజకీయ బెదిరింపుల నేపథ్యంలో ఏర్పాటు చేయలేకపోతున్నారని తెలుస్తోంది. ఈరెండు దుకాణాలు తమకే ఇవ్వాలని ఓ నేత ఒత్తిళ్లు తెస్తుండడంతో ఎక్సైజ్ అధికారులు జోక్యం చేసుకునే సాహసం చేయలేకపోతున్నారు. ఇక్కడ దుకాణం ఏర్పాటు చేయనీయక పోవడంతో విజయవాడలో పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లినట్లు సమాచారం.
- చెన్నేకొత్తపల్లిలో 22వ నంబరు మద్యం దుకాణం హైదరాబాద్‌కు చెందిన వ్యాపారికి దక్కింది. తమ పరిధిలో మద్యం దుకాణం పెట్టాలంటే కుదరదని ఓ నేత హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. దుకాణమైనా అప్పగించాలనీ, లేదంటే 50 శాతం వాటా అయినా ఇవ్వాలని మంతనాలు సాగిస్తున్నట్లు తెలిసింది. తలుపుల మండలంలోని 69వ దుకాణం తెలంగాణకు చెందిన ఓ మద్యం వ్యాపారికి దక్కింది. గుడ్‌విల్ తీసుకుని వెళ్లిపోవాలనీ, తమ పార్టీ కార్యకర్తలకు ఇవ్వాలంటూ ఓ ప్రజాప్రతినిధి పేరుతో నేతలు ఒత్తిళ్లు తెస్తుండడంతో ఆ వ్యాపారి ఇటువైపే చూడట్లేదన్న చర్చ నడుస్తోంది.
- మడకశిర నగర పంచాయతీ, రూరల్‌లో టీడీపీ నేత కుటుంబానికి నాలుగు మద్యం దుకాణాలు దక్కాయి. వాటిలో మూడింటిని మాత్రమే ప్రారంభించారు. మడకశిర గ్రామీణంలో 81వ దుకాణాన్ని ప్రారంభించలేదు. దుకాణానికి లైసెన్సు ఫీజు చెల్లించినా సిండికేట్‌గా మూడింటిలో మాత్రం మద్యం అమ్మకాలు చేపట్టారు. అమరాపురంలో తల్లీకొడుకులకు రెండు దుకాణాలు దక్కితే.. ఒకటి మాత్రమే ప్రారంభించారు. ఇక్కడ 84వ దుకాణం ప్రారంభించలేదు. రెండు దుకాణాలు కలిపి ఒకటిగానే అమ్మకాలు సాగిస్తున్నారు. బత్తలపల్లిలో 13వ దుకాణానికి భవనం దొరకలేదంటూ ప్రారంభించకుండా దాట వేస్తున్నారు.
- హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారికి తాడిమర్రిలో మద్యం దుకాణం దక్కినా.. ఏర్పాటు చేయలేకపోతున్నారు. అంతో.. ఇంతో.. ఇస్తామనీ, దుకాణం వదిలిపెట్టిపోవాలంటూ కూటమిలోని కొందరు నేతలు ఒత్తిళ్లు చేస్తున్నట్లు సమాచారం.

ప్రారంభించాల్సిందే..

జిల్లాలో 87 మద్యం దుకాణాలకు లైసెన్సు ఫీజు చెల్లించారు. 82 షాపులకు డిపో నుంచి మద్యం సరఫరా అవుతోంది. ఇందులో 79 దుకాణాల్లో అమ్మకాలు కొనసాగుతున్నాయి. ప్రారంభించని ఎనిమిది దుకాణదారులకు నోటీసులు జారీ చేశాం. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం.

-గోవిందునాయక్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

సమాధులనూ తోడేస్తున్నారు..!


సమాధుల మధ్యలో మట్టి తవ్వుతున్న దృశ్యం

హిందూపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): శ్మశానంలో మట్టి తోడేళ్లు పడ్డాయి. సమాధులనూ తోడేస్తున్నాయి. అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో శ్మశానవాటికలో సమాధులున్న వారి బంధువులే అడ్డుకుంటున్నారు. పరిగి మండలంలోని హిందూ శ్మశానవాటికలో మట్టిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అభివృద్ధి పేరుతో మట్టి దందాకు తెరలేపారు. శ్మశానవాటికలో బుధవారం సమాధుల మధ్య ఎక్స్‌కవేటర్లతో మట్టిని యథేచ్ఛగా తవ్వి, తరలిస్తున్నారు. ఈ మట్టి రోడ్డుకోసమని తరలించేవారు చెబుతున్నారు. ఇటీవల మట్టిదందా చేసే వ్యక్తులు చెరువులు, నది పరీవాహక ప్రాంతాల నుంచి తరలించారు. ప్రైవేటు లేఅవుట్లలో వందలాది ట్రిప్పులు తరలించి, ఎక్కడపడితే అక్కడ గుంతలు తీశారు. వర్షం రావడంతో చెరువులు, నది పరీవాహక ప్రాంతాల నుంచి మట్టిని తరలించడానికి వీలులేకుండా పోయింది. ఆఖరుకు శ్మశానవాటికను ఎంచుకున్నారు. అక్కడ దర్జాగా ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తవ్వి, తరలిస్తున్నారు. సమాధులున్నవారి బంధువులు వెళ్లి అడ్డు చెప్పినా ఖాతరు చేయయట్లేదు. దీంతో కొంత మంది యువకులు వెళ్లి అడ్డుకున్నారు. అయినా మట్టి తరలించే కొందరు తాము అధికారపార్టీకి చెందినవారమనీ, ఇష్టమొచ్చిన చోట మట్టిని తవ్వకుంటామంటూ బుకాయించారు. అయినా యువకులు తగ్గలేదు. మట్టిని తరలిస్తే ఊరుకోమని అడ్డుకున్నారు. దీంతో చేసేదిలేక మట్టి అక్రమార్కులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

చోద్యంచూస్తున్న అధికారులు

శ్మశానవాటిక ప్రాంతంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మట్టి ఎత్తడానికి, గుంత పెట్టడానికి వీలులేదు. శ్మశానవాటికలో గుంతలు పెడితే పూడ్చడానికి స్థలం ఉండదు. దీనిని అడ్డుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం దురదృష్టకరం. అధికార పార్టీ నాయకులు కావడంతో అధికారులు కూడా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా మట్టి దందా చేసే వ్యక్తులు శ్మశానవాటికను కూడా వదలకపోవడం సిగ్గుచేటు.

మా దృష్టికి రావడంతో అడ్డుకున్నాం


శ్మశాన వాటికలో మట్టి తవ్వుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. వెంటనే సిబ్బందిని పంపి, అడ్డుకున్నాం. మట్టి తవ్వకాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంటాం.

-హసీనాసుల్తానా, తహసీల్దార్, పరిగి

దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి అర్హులైన విద్యార్థినీవిద్యార్థులు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ సంచాలకుడు శివరంగప్రసాద్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నూతనంగా రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేసేందుకు http://jnanabhumi.apcfss.in వెబ్‌సైట్‌లో కళాశాల జ్ఞానభూమి లాగిన్ కావాలన్నారు. ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తులు పూర్తి చేయాలన్నారు.

కేసులతో సరి..!

చిన్న ఫిర్యాదు అందినా.. పోలీసుల ట్రీట్‌మెంట్ మామూలుగా ఉండదు. ఘటనతో సంబంధమున్న వారితోపాటు లేనివారికీ విచారణ పేరుతో చుక్కలు చూపిస్తారు. పిలిచిన సమయానికి స్టేషన్‌కు వెళ్లాల్సిందే. గంటల తరబడి అక్కడ వేచి ఉండాల్సిందే. విచారణ గురించి వేరే చెప్పక్కర్లేదు. కదిరిలో మాత్రం పోలీసుల తీరు అందుకు భిన్నంగా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ ప్రాబల్యం ఉన్నవారిపై కేసుల నమోదుతో సరిపెడుతున్నారన్న ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. కేసులు నమోదు చేసినా.. నిందితులు కళ్లెదుటే తిరుగుతున్నా.. పట్టించుకునే నాథుడు లేడు. ఎందుకు అరెస్టు చేయరోనన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. చిన్నాచితకా కేసుల్లో సామాన్యులను గంటల్లో అరెస్టు చేసి, రిమాండ్‌కు పెట్టే పోలీసులు.. రాజకీయ పలుకుబడి ఉన్నవారిపై ఉదాసీనంగా ఎందుకు వ్యవహరిస్తున్నారోనన్నది అంతుచిక్కని విషయం. రాజకీయ పలుకుబడి ఉన్నవారికో న్యాయం, తమకో న్యాయమా అని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు.

- కదిరి, ఆంధ్రజ్యోతి

అరెస్టులు పట్టని ఖాకీలు

- రాజకీయం ముసుగులో వైసీపీ నాయకుల అక్రమాలు
- పలువురిపై కేసులు
- దర్జాగా తిరుగుతున్న నిందితులు
- పట్టించుకోని పోలీసులు
- ఏళ్లు గడుస్తున్నా తేలని హత్య కేసులు

కూటమి ప్రభుత్వం కొలువుదీరినా..



రాజకీయ ముసుగులో గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు చేసిన అక్రమాలు అన్నీఇన్నీ కావు. వారిపై కేసులు నమోదైనా పోలీసులు అరెస్టు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారు కూడా పోలీసులు తమను ఏమీ చేయలేరన్నట్లు వ్యవహరిస్తున్నారు. కేసులు నమోదైనా వైసీపీ నాయకులను మాత్రం అరెస్టు చేయలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరినా పరిస్థితిలో మార్పులేదు. కొంతమంది చర్చి ఆస్తులను కబ్జా చేస్తే.., మరికొందరు మహిళాసంఘాల సొమ్ము కాజేశారు. ఇంకొందరు బినామీ పేర్లతో భూములను ఆక్రమించుకున్నారు. వారిపై కేసులు కూడా నమోదయ్యాయి. వీరి వెనుక మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలున్నట్లు సమాచారం. వైసీపీ పాలనాకాలం మొత్తం కాలం గడుపుతూ వచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వైసీపీ నాయకుల అక్రమాలు, అన్యాయాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. కేసులు నమోదవుతున్నాయి. అయినా వీరిని పోలీసులు అరెస్టు చేయకపోవడం శోచనీయం. ఏళ్లు గడుస్తున్నా.. రెండు హత్యకేసుల్లో నిందితులను పోలీసులు ఇంతవరకు తేల్చలేదు. కాలేజీ సర్కిల్‌లో ఓ మహిళను హత్య చేసి రెండేళ్లు దాటింది. ఇంతవరకు ఆ కేసులో నిందితులెవరన్నది అంతుచిక్కని విషయం. బంగారు వ్యాపారి హత్యకేసులో నిందితుల ఆచూకీ నేటికీ కనిపెట్టలేకపోతున్నారు. దీంతో పోలీసులు.. సామాన్యులపై మాత్రమే ప్రతాపం చూపుతారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

తేలని హత్యకేసులు

పట్టణంలో రెండు హత్య కేసులు ఏళ్లు గడుస్తున్నా.. నిగ్గు తేలట్లేదు. రెండేళ్ల క్రితం కాలేజీ సర్కిల్ సమీపంలో ఓ మహిళను హత్య చేశారు. ఆ కేసులో నిందితులెవరో, ఎవరు చేశారో ఇంతవరకు పోలీసులు నిగ్గు తేల్చలేదు. పట్టణంలోని చౌక్ సర్కిల్‌లో కరణ్ అనే బంగారు వ్యాపారి హత్య జరిగింది. ఆ కేసులో కూడా ముద్దాయిలెవరో పోలీసులు తేల్చలేదు. అసలు ఈ కేసులు ఉన్నాయో, మూసివేశారో తెలియని పరిస్థితి నెలకొంది.

పరిశీలించి, చర్యలు తీసుకుంటాం

రాజకీయ ముసుగులో అక్రమాలు చేసినవారిపై కేసులు నమోదైనట్లు నా దృష్టికి వచ్చింది. వాటిని పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. పెండింగ్‌లో ఉన్న రెండు హత్యకేసుల్లో నిందితులను అరెస్టు చేస్తాం.

-శివనారాయణస్వామి, డీఎస్పీ, కదిరి

ఇష్టారాజ్యంగా..

- రాజకీయం ముసుగులో గత ఐదేళ్లు వైసీపీ నాయకులు అనేక అక్రమాలకు పాల్పడ్డారు. అడిగేవారు లేరని ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. దీనికి కొంతమంది పోలీసు అధికారులు కూడా వత్తాసు పలికారు. ఓ పోలీసు అధికారి అన్నీ తానై ఇష్టారాజ్యంగా వ్యవహరించి, ఓ వ్యక్తి ఆత్మహత్యకు కారణమైనట్లు బాధితుడే సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. అయినా ఇంతవరకు ఆ పోలీసు అధికారిపై చర్యలు తీసుకోలేదు.
- కదిరి టౌన్ పోలీసు స్టేషన్‌లో చర్చి ఆస్తుల అక్రమ రిజిస్ట్రేషన్‌పై కేసు నమోదైంది. గత ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసిన బీఎస్ మగ్బుల్, ఆ పార్టీ నాయకులు పరికి షామీర్, హర్షద్ ఈ కేసులో నిందితులు. ఇంతవరకు ఎవ్వరినీ పోలీసులు అరెస్టు చేయలేదు. చర్చి ఆస్తుల అక్రమ రిజిస్టేషన్ విషయమై దాదాపు 20 ఏళ్లలో పలు ప్రాంతాల్లో పరికి షామీర్‌పై కేసులు నమోదయ్యాయి. అయినా నిందితుడిని పోలీసులు అరెస్టు చేయలేదు. పరికి షామీర్‌పై అనేక కేసులున్నాయి.
- ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో ఓ ముస్లిం మహిళ ఎన్నికల ప్రచారానికి వచ్చి, కూలీ అడిగిందని ఆమెపై చెప్పుతో దాడిచేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. తరువాత భయభ్రాంతులకు లోనుచేసి, ఫిర్యాదు వెనక్కి తీసుకునేలా చేశారని ఆ మహిళ చెప్పింది.
- 2024 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మగ్బుల్ పలు చోట్ల ఓ వర్గాన్ని రెచ్చగొట్టేలా ప్రచారం చేశారన్న విమర్శలున్నాయి. దీనిపై ప్రస్తుత ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల సంఘానికి అప్పట్లో ఫిర్యాదు చేశారు. ఆయన ప్రసంగంలో రెండు వర్గాల మధ్య చిచ్చుపెట్టే అంశాలున్నాయనీ, ఇది సరికాదని ఫిర్యాదు చేశారు.
- మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగాదేవిపై మూడునెలల క్రితం కేసు నమోదైంది. మున్సిపాలిటీలోని మహిళాసంఘాలకు చెందిన నిధులను వాడుకున్నట్లు ఆమెపై సంఘం సభ్యులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈకేసులో ఇంతవరకు పోలీసులు చర్యలు చేపట్టలేదు.
- గతంలో పట్టణ సీఐగా పనిచేసిన మధుపై కదిరి పట్టణ పోలీసు స్టేషన్‌లో మూడు, రూరల్‌లో ఒక కేసు నమోదయ్యాయి. వీటిలో ఎస్సీ, ఎస్టీ కేసులు కూడా ఉన్నాయి. ఇటీవల కదిరి రూరల్ స్టేషన్ పరిధిలో ఎస్సీ వర్గానికి చెందిన ఉదయ్‌కుమార్ ఆత్మహత్య చేసుకుంటూ, తన మరణానికి సీఐ మధు కారణమంటూ రికార్డు చేశాడు. మరణవాంగ్మూలం రాసి చనిపోయాడు. దీంతో సీఐ మధుతోపాటు తెలంగాణకు చెందిన సీఐ శ్రీనివాసుపై కేసు నమోదు చేశారు. ఇతడిపై కూడా చర్యల్లేవు.
- ఓ మాజీ ఎమ్మెల్యే అనుచరుడు షామీర్ బాషా ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా దాదాపు రూ.5ఎకరాల స్థలాన్ని బినామీ పేరుతో స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో దాదాపు రూ.90 లక్షలు పేద ప్రజల నుంచి వసూలు చేసినట్లు సమాచారం. దీనివెనుక ఓ మాజీ ఎమ్మెల్యేతోపాటు, మరో నాయకుడు ఉన్నట్లు సమాచారం. ఇతడిని అరెస్టు చేయకుండా పోలీసులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కావడంలేదని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.


పరగోడు డ్యాం నిండి పరవళ్లు తొక్కుతున్న చిత్రావతి

పరగోడు ఫుల్..

- డ్యాంపైనుంచి ప్రవహిస్తున్న నీరు
- పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన


నిండుకుండలా పరగోడు డ్యాం

చిలమత్తూరు, అక్టోబరు 23: మండల సరిహద్దులోని కర్ణాటక ప్రాంతంలో చిత్రావతి నదిపై నిర్మించిన పరగోడు డ్యాం పూర్తిగా నిండిపోయింది. మంగళవారం రాత్రి నుంచి డ్యాంపైనుంచి నీరు ప్రవహిస్తోంది. చిత్రావతి వరద జిల్లాలోకి వస్తోంది. మండలంలోని కొడికొండ, మొరసవాండ్లపల్లి, మధురేపల్లి, కందూరిపర్తి, సుబ్బరావుపేట, తిమ్మాడపల్లి మీదుగా చిత్రావతి ప్రవహిస్తోంది. ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, నదీ పరిసరాల్లోకి రావద్దని హెచ్చరిస్తున్నారు. రైతులు పొలాలకు వెళ్లే క్రమంలో నదిని దాటే ప్రయత్నం చేయరాదని కోరుతున్నారు. బుధవారం కూడా కర్ణాటకలో భారీ వర్షం కురిసిందనీ, దీంతో చిత్రావతి ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందంటున్నారు. రాత్రి సమయాల్లో నదిపై ప్రయాణాలు చేయరాదని చెబుతున్నారు. పరగోడు డ్యాం నిండటంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డ్యాంలో నీరు నిండుగా ఉంటే చిత్రావతి నది పరీవాహక ప్రాంతాల్లోని బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉంటుందని ఆనందపడుతున్నారు.

ఆరో నిందితుడూ దొరికాడు..

- గ్యాంగ్‌రేప్ కేసులో చాకలి శ్రీనివాసులు అరెస్టు
- ఇంకా బాధితులు ఉంటే నిర్భయంగా ముందుకు రండి
- ఫిర్యాదు చేస్తే.. న్యాయం చేస్తాం: ఎస్పీ రత్న భరోసా

సంచలనం రేపిన చిలమత్తూరు మండలంలో అత్తాకోడలిపై గ్యాంగ్‌రేప్ కేసులో తప్పించుకు తిరుగుతున్న ఆరో నిందితుడు చాకలి శ్రీనివాసులు ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. అతడిని అరెస్టు చేసి, కోర్టుకు హాజరు పరచినట్లు ఎస్పీ రత్న బుధవారం తెలిపారు. గ్యాంగ్‌రేప్ కేసులో నిందితులు పలు అత్యాచారాలు, దోపిడీలకు పాల్పడినట్లు తెలుస్తోందనీ, వారి బాధితులు ఎవరైనా ఉంటే నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వివరాలు 7లో..

సివిల్స్ శిక్షణకు మంత్రి సాయం


ఐఏఎస్ అకాడమీ ప్రతినిధికి చెక్కు అందజేస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అకాడమీ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ధర్మవరం ప్రాంతం నుంచి సివిల్స్ శిక్షణకు ఎంపికైన 28 మంది విద్యార్థులకు వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ రూ.5లక్షల సాయం అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఐఏఎస్ అకాడమీకి అందజేశారు. నాలుగు రోజుల క్రితం ధర్మవరంలో సివిల్ సర్వీసెస్ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అకాడమీ నిర్వహించిన అర్హతపరీక్షలో ధర్మవరం ప్రాంతం నుంచి 28 మంది విద్యార్థినులు ఉచిత శిక్షణకు ఎంపికయ్యారు. వీరికి రెండేళ్లపాటు హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. వారి వసతి ఖర్చుల నిమిత్తం మంత్రి ఆర్థికసాయం చేశారు.




పండమేరులో పెద్ద పెద్ద చేపలు కొట్టుకొచ్చాయి. అనంతపురం నగర శివారులు పారే నీటిలో పలువురు వలలు వేసి వాటిని పట్టుకున్నారు. ప్రమాదాన్ని పసిగట్టిన చేపలు.. అమాంతం గాలిలోకి ఎగిరి.. వల నుంచి ఆవలకు దూకి తప్పించుకుపోయాయి. దొరికిన వాటిని దొరికినట్లే కొందరు అక్కడే కాల్చుకుతిన్నారు. మరికొందరు కిలో రూ.100 ప్రకారం అక్కడే విక్రయించారు. కనగానపల్లి చెరువు తెగిపోవడంతో అక్కడి చేపలు వరద నీటిలో కొట్టుకువచ్చాయి.

- అనంతపురం రూరల్, ఆంధ్రజ్యోతి




నంజుకుతిన్నారు!



పెరటికోళ్ల పెంపకం పేరుతో బురిడీ

డ్వాక్రా సంఘాల నుంచి రూ.2.5 కోట్లు వసూలు

వైసీపీ ప్రభుత్వంలో అధికారుల నిర్వాకం

పెరటి కోళ్ల పెంపకం పేరుతో డ్వాక్రా మహిళల నుంచి సేకరించిన రూ.2.5కోట్లు డీఆర్‌డీఏ-వెలుగు అధికారులు కొందరు స్వాహా చేశారు. పెరటికోళ్ల పెంపకం పథకం స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థికంగా భారమైనా అధికారులకు మాత్రం కాసుల వర్షం కురిపించింది. రూ.వెయ్యి విలువ చేసే 11 కోడి పిల్లలను ఓ యూనిట్‌గా పంపిణీ చేసి, రూ.4వేలు వసూలు చేయడంపై మహిళా సంఘాలు అప్పట్లోనే తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కాంట్రాక్టర్‌కు లబ్ధి కలిగించడానికే బలవంతంగా మహిళలకు కోళ్ల పెంప కం యూనిట్లు అంటగడుతున్నారని, ఇందులో అధికారులు ముడుపుల కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారనే ఆరోపణలు ఆశాఖలోనే వినిపించా యి. వద్దంటున్నా వినకుండా ఉమ్మడి జిల్లాలో పెరటికోళ్ల పెంపకం పేరుతో పొదుపు సంఘాల మహిళలపై రూ.2.5 కోట్ల ఆర్థిక భారం మోపారు.

- అనంతపురం క్లాక్‌టవర్/ఆంధ్రజ్యోతి


ఇవే పెరటి కోళ్లు

ప్రతి మండలంలో వంద యూనిట్ల పంపిణీకి కుట్ర

పెరటికోళ్ల పెంపకం పేరుతో ఉమ్మడి జిల్లాలో 2022-23 సంవత్సరంలో మండలానికి వంద యూనిట్లు చొప్పున 6300యూనిట్లు తీసుకువచ్చారు. ఒక్కో యూనిట్ ధర రూ.4వేలుగా నిర్ణయించారు. ఇందులో మొత్తం 11కోళ్లు ఎంపికైన మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. 8 పెట్ట కోళ్లు, మూడు పుంజులను ఒక యూనిట్‌గా నిర్ణయించి పంపిణీ చేశారు. అయితే 11 కోళ్లు బహిరంగ మార్కెట్‌లో రూ.1000కు మించి ఉండవని అప్పటి లబ్ధిదారులు పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి మరింత తక్కువ ధరకు యూనిట్లు ఇవ్వాల్సిన నేపథ్యంలో రెట్టింపు ధరను వసూళు చేయడంతో మహిళా సంఘాల సభ్యులు తిరస్కరించారు.


నాసిరకం పెరటి కోళ్లు

యూనిట్లు పంపిణీ చేయాలని తీవ్ర ఒత్తిడి

పెరటికోళ్ల పెంపకం యూనిట్లు లబ్ధిదారులకు అందజేయకపోయినా, ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేయకపోయినా సంబంధిత సిబ్బందిపై ఉన్నతాధికారులు తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు అప్పట్లో ఆశాఖలో గట్టిగానే వినిపించింది. ఈక్రమంలోనే ఆసక్తి లేకపోయిన కూడా బలవంతంగా మహిళలకు పెరటికోళ్ల పెంపకం యూనిట్లు తగలగట్టారు. కోడి పిల్లలు చనిపోతే డబ్బులు తిరిగి ఇస్తామని అధికారులే ప్రకటించారు. అయితే ఇచ్చిన కోడిపిల్లల్లో 90శాతానికి పైగా చనిపోయాయని అధికారులే చెప్పారు. కానీ ఒక్క సంఘానికి కూడా తిరిగి డబ్బులు ఇవ్వలేదు. మరి కోట్లాది రూపాయల సొమ్ము ఎక్కడికి వెళ్లిందనేది సందేహమే. కోళ్ల పెంపకం యూనిట్లు ఇస్తామని ఉమ్మడి జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల నుంచి రూ.2.5కోట్లు డబ్బులు వసూలు చేశారు.

అదంతా బోగస్సే



వైసీపీ ప్రభుత్వంలో పెరటికోళ్ల పేరుతో మహిళా సంఘాల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేశారు. ఒక్కో సంఘం నుంచి యూనిట్‌కు రూ.4వేలు వసూలు చేశారు. అయితే ఇచ్చిన కోడిపిల్లలన్నీ చనిపోయాయి. దీంతో రూ.4వేలు ఆయా సంఘాలకు వృథా అయ్యాయి. అధికారులు మాత్రం డబ్బులు తీసుకుని ఎంజాయ్ చేశారు. చనిపోయిన కోడి పిల్లలకు డబ్బులు వెనక్కు ఇస్తామని చెప్పారు. అయితే ఇప్పటి వరకు ఆ డబ్బులు తిరిగి ఇవ్వలేదు. కోట్లాది రూపాయల డబ్బులు ఎవరు తిన్నట్లు?

- రామసుబ్బులు, జిల్లా సమాఖ్య మాజీ సభ్యురాలు

పూర్తిగా తెలుసుకోవాల్సి ఉంది

పెరటికోళ్ల పథకం అమలుపై అప్పట్లో ఏమి జరిగిందో తెలుసుకోవాల్సి ఉంది. అప్పట్లో గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యుల జీవనోపాధుల పెంపు, పౌష్టికాహారం అందజేయడమే లక్ష్యంగా పెరటికోళ్ల పెంపకం యూనిట్ల పథకాన్ని ప్రభుత్వం తెచ్చింది. ఇందులో ఎంపిక చేసిన మహిళ సంఘాల సభ్యులకు యూనిట్లు అందజేశారు. అయితే ఉమ్మడి జిల్లాలో చేపట్టిన పథకం అమలు తీరు, డబ్బుల వసూళ్లపై పూర్తిగా మాకు తెలియదు. అప్పట్లో ఉన్న అధికారులే ఈ పథకాన్ని చేపట్టారు. బాధితులు ఎవరైన ఉంటే నిధులు ఎలా రికవరీ చేయాలి. ఎవరి నుంచి చేయాలనే అంశాలపై పరిశీలిస్తాం.


- ఈశ్వరయ్య, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ

విద్యార్థులను మోసం చేసిన జగన్

▪ ఏఐఎస్ఎఫ్ నాయకుల మండిపాటు



ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కళాశాలల ఫీజులను తామే చెల్లిస్తున్నామని గొప్పలు చెప్పిన జగన్మోహన్‌రెడ్డి ఉత్తిత్తి బటన్‌లు నొక్కి విద్యార్థులను మోసం చేశాడని ఏఐఎస్ఎఫ్ నాయకులు మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజుల బకాయిలపై బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెన్నార్‌భవన్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ ఉన్నత విద్యాకోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఫీజులు చెల్లించడం ప్రభుత్వ బాధ్యతన్నారు. వారికి విద్యాదీవెన, వసతి దీవెన పేరుతో జగన్‌రెడ్డి ఆయన జేబులోనుంచి ఇస్తున్నట్లు తెగప్రచారం చేసుకున్నారని మండిపడ్డారు. డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ వంటి కోర్సులు అభ్యసించిన విద్యార్థులకు ఐదేళ్లలో రూ.3500కోట్లు రాష్ట్ర వ్యాప్తంగా బకాయిపెట్టి సీఎంగా దిపోయారన్నారు. ఫీజుమొత్తాన్ని ఒకేసారి చెల్లించాల్సి ఉన్నా, నాలుగుసార్లు ఉత్తిత్తి బటన్‌లు నొక్కి మభ్యపెట్టారని మండిపడ్డారు. విద్యార్థులు ఫీజులు కట్టనిదే కళాశాలల యాజమాన్యాలు పరీక్షలు పెట్టమని, సర్టిఫికెట్లు ఇవ్వమని తెగేసి చెబుతున్నాయని వాపోయారు. కూటమి ప్రభుత్వం గత బకాయిలతోపాటు ఈ విద్యాసంవత్సరం మొత్తం ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సాంఘిక సంక్షేమశాఖ డీడీకి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మంజునాథ్, ఉమామహేష్, వంశీ, హరికృష్ణ, నాని, మన్సూర్, ప్రేమ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మృతి చెందిన అట్టే వెంకటరమణ, పేట నాగేశ్వర్‌రెడ్డి (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతుల దుర్మరణం

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన టిప్పర్

శింగనమల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతురాజు కాల్వ కూతలేరు బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సోదనపల్లి గ్రామానికి చెందిన రైతులు పేట నాగేశ్వర్‌రెడ్డి(55) అట్టే వెంకట రమణ(52) మృతి చెందారు. శింగనమల పోలీసులు తెలిపిన మేరకు.. సోదనపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణ, నాగేశ్వర్‌రెడ్డి మంచి స్నేహి తులు. వెంకటరమణ వేరుశనగ పంటను బుధవారం తొలగించాడు కాయల శాంపిల్‌ను తీసుకుని, స్నేహితుడైన నాగేశ్వర్‌రెడ్డితో కలిసి నాయనపల్లిక్రాస్‌లో ఉండే వేరుశనగ వ్యాపారి దగ్గరికి ద్విచక్రవాహనంపై సాయంత్రం బయల్దేరారు. పోతురాజుకాల్వ కూతలేరు బ్రిడ్జి వద్దకు రాగానే అనంతపురం నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో రైతులు వెంకటరమణ, నాగేశ్వర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు వెంకటరమణకు భార్య, కుమారుడు, కుమార్తె నాగేశ్వర్‌రెడ్డికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ శరత్ చంద్ర పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాలను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

విషాదఛాయలు

ఇద్దరు రైతుల మృతితో సోదనపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలువుకున్నాయి. గ్రామంలో ఏ వ్యవసాయ పనుల్లోనైనా సరే నాగేశ్వర్‌రెడ్డి, వెంకటరమణ ముందుండేవారు. గతంలో ఇద్దరు డ్రిప్పు కంపెనీలో పని చేస్తూ, వ్యవసాయ పనుల్లో కూడా చురుగ్గా ఉండేవారు. రైతులకు అవసరమైన సలహాలు ఇస్తూ చేదోడువాదోడుగా ఉండేవారు. ఇద్దరు రోడ్డు ప్రమాదం మృతి చెందడంతో సంఘటన స్థలానికి గ్రామస్థులు తరలివెళ్లారు. మృతుల కుటుంబసభ్యులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతం దద్దరల్లింది.


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

తండ్రిని చంపిన తనయుడు

యాడికి, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యతో కన్న కొడుకే తండ్రిని చంపిన సంఘటన బుధవారం యాడికిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు వీరన్నపల్లి గ్రామానికి చెందిన వరలక్ష్మీనారాయణ(50) యాడికిలోని వెంగమ నాయుడుకాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈయనకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య వరలక్ష్మి, కుమారుడు కార్తీక్. కాగా రెండో భార్య రమాదేవికి ఒక కుమారుడు ఉన్నారు. లక్ష్మీనారాయణ ఇద్దరు భార్యలకు దూరంగా ఉంటున్నాడు. ఈయన పేరుతో 5.5ఎకరాల పొలం ఉంది. ఈ పొలం విషయంలో మొదటి భార్య వరలక్ష్మి, కుమారుడు కార్తీక్‌తో గొడవలు ఉన్నాయి. గతంలో వరలక్ష్మి, కార్తీక్‌లపై లక్ష్మీనారాయణ దాడి కూడా చేశాడు. పొలం విషయమై వరలక్ష్మి, కార్తీక్‌లు కోర్టుకు వెళ్లి 3.5ఎకరాలు వారికి చెందేలా ఆర్డర్ తెచ్చుకున్నారు. ఆ తర్వాత కూడా గొడవలు ఆగలేదు. కోర్టు ఉత్తర్వుల మేరకు భూమి దక్కినా తండ్రి జోక్యం చేసుకోవడాన్ని కార్తీక్ జీర్ణించుకోలేకపోయాడు. ఈక్రమంలోనే బుధవారం మధ్యాహ్నం యాడికిలోని కుంటవీధిలో ఒంటరిగా వెళుతున్న లక్ష్మీనారాయణపై కార్తీక్ రాళ్లతో దాడి చేసి హతమార్చాడు. అటు వైపు వెళుతున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా ప్రదేశానికి చేరుకున్న సీఐ ఈరన్న, సిబ్బంది హత్యపై విచారణ చేపట్టారు. తండ్రిని హత్య చేసిన కార్తీక్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మృతుడి రెండో భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. లక్ష్మీనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రికి తరలించారు.


పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన కార్తీక్

హత్య చేసి.. నిర్భయంగా..

తండ్రిని చంపిన అనంతరం కార్తీక్ నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌కు బయల్దేరాడు. దారి మధ్యలో రక్తపు మరకలు గమనించిన వారు ప్రశ్నించగా కుంటలో ఒక మనిషిని చంపినా పోలీస్‌స్టేషన్ వద్దకు పోతున్నా అంటూ సమాధానం ఇచ్చినట్లు చర్చ జరుగుతోంది. పోలీస్‌స్టేషన్‌లో తండ్రి పేరు చెప్పడానికి కూడా కార్తీక్ ఇష్టపడలేదంటే అతడు తండ్రిపై ఎంతగా ద్వేషం పెంచుకున్నాడో అర్థం చేసుకోవచ్చు.

తస్మాత్ జాగ్రత్త !

సబ్‌యూనిట్ ఆఫీసర్లకు అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్


మాట్లాడుతున్న సత్యనారాయణ

అనంతపురం టౌన్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ జిల్లా మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ ఆదేశించారు. జిల్లా కార్యాలయంలో సబ్‌యూనిట్ ఆఫీసర్లతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. వర్షాలు కురుస్తుండటంతో చెత్తచెదారం నిల్వ ఉంటే అక్కడ దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈదోమల వల్ల వివిధరకాల జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటివ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. అందుకే వర్ష ప్రభావిత ప్రాంతాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చెప్పట్టాలన్నారు. ఈవిషయంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ల పాత్రచాలా కీలకమన్నారు. సిబ్బందితో పాటు ఇతరశాఖల అధికారులను సమన్వయం చేసుకొని పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహించినట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్లు, మలేరియా విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 190 చెరువుల్లోకి నీరు

పొంగి పొర్లుతున్న 63చెరువులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలోని చెరువులకు జలకళ వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 301 చెరువులు ఉండగా....ఇందులో 190 చెరువుల్లోకి వర్షం నీరు చే రింది. 63చెరువులు పొంగిపొర్లుతున్నాయి. 17చెరువులు 75శాతం, 35చెరువులు 50శాతం, 75చెరువుల్లో 25శాతం నీటితో ఉన్నాయి. రాయదుర్గం మండలంలో 15చెరువులు, బొమ్మనహాళ్ 2, డి.హీరేహాళ్ 4, కణేకల్లు 5, గుమ్మఘట్ట 13మొత్తం 39చెరువులు వర్షం నీటితో నిండాయి. రాప్తాడు నియోజకవర్గంలో అనంతపురం రూరల్ 5 చెరువులు, ఆత్మకూరు 9, రాప్తాడు 15చెరువుల్లోకి మొత్తం 29చెరువుల్లోకి నీరు చేరింది. గుత్తి 23, గుంతకల్లు 7, పామిడి 10చెరువుల్లోకి నీరు వచ్చింది. వజ్రకరూరు 8, విడపనకల్లు 2, ఉరవకొండ 8, కూడేరు 6, బెళుగుప్ప 8చెరువులు నీటితో నిండాయి. కుందుర్పి 1, శెట్టూరు 4, కంబదూరు 4, కళ్యాణదుర్గం 5, బ్రహ్మసముద్రం 12 మొత్తం 26చెరువులకు జలకళ వచ్చింది. పెద్దవడుగూరు 5, తాడిపత్రి 4, యాడికి 4 మొత్తంగా 13చెరువులకు నీరు చేరింది. శింగనమల 2, గార్లదిన్నె 1, పుట్లూరు 1, బుక్కరాయసముద్రం 1, నార్పల 3, యల్లనూరు 1 చెరువు వర్షం నీటితో ఉన్నాయి. జిల్లా వ్యాప్తం గా 190చెరువుల్లో 0.765టీఎంసీల నీరు నిల్వ ఉంది.


నిండుకుండలా బండమీదపల్లి చెరువు

26న చర్చావేదిక

అనంతపురం కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాగునీటి వనరుల పరిస్థితులపై ఈనెల 26న ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో చర్చావేదిక నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు సీపీఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సీపీఎం బృందం బస్సుయాత్ర చేపట్టిందని తెలిపారు. యాత్రలో బృందం దృష్టికి వచ్చిన అంశాలపై మీడియా ప్రతినిధులు, జిల్లా అభివృద్ధిని కాంక్షించే ముఖ్యులతో చర్చిస్తామన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా ప్రజాప్రతినిధులకు నివేదిక ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వెబ్‌సైట్‌లో జాబితా

- డీఎంహెచ్ఓ

అనంతపురం టౌన్, అక్టోబరు(ఆంధ్రజ్యోతి): గ్రేడు-3 ఏఎన్ఎంల ఉద్యోగోన్నతుల సీనియార్టీ జాబితా వైద్యశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ.దేవి బుధవారం ఓప్రకటనలో తెలిపారు. ఈసీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల26 లోగా ఆధారాలతో జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఆతర్వాత వచ్చే ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోమని స్పష్టం చేశారు. అనంతరం సీనియార్టీ జాబితా ప్రకారం గ్రేడు-3 ఏఎన్ఎంలకు ప్రమోషన్లు ఇస్తామని తెలిపారు.

ఎప్పట్లానే..!

రైతును ముంచిన వేరుశనగ

ఎకరాకు 3 నుంచి 5 బస్తాలే దిగుబడి

పెట్టుబడి కూడా దక్కని దుస్థితి

ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు


గుత్తిలో వర్షానికి పడిసిముద్దయిన వేరుశనగ కట్టె

● దిగుబడి రావడం కష్టమే



ఈ ఏడాది ఖరీఫ్‌లో వానలు బాగా వస్తాయన్న ఆశతో ఐదు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. విత్తనం నుంచి పంట సాగు సాగు కోసం రూ.3లక్షల దాకా పెట్టుబడి పెట్టా. పంట సాగు చేసిన తర్వాత ఊడలు దిగే సమయం, పిందె ఊరే సమయంలో వానలు పడలేదు. దాంతో పంట దిగుబడి రాలేదు. పంట దిగుబడి లేకపోవడంతో మరింత అప్పుల పాలయ్యా. ప్రభుత్వం పంటనష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

- అనిల్ కూమార్, రైతు, పెద్ద మట్లగొంది, శింగనమల మండలం

అనంతపురం అర్బన్/శింగనమల అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎప్పట్లానే ఈ ఏడాది కూడా వేరుశనగ రైతుకు నష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగ పంట వర్షాభావంతో దెబ్బతింది. పంట కీలక సమయం పూత దశ, ఊడలు దిగే దశ, పిందెలు ఊరే సమయాల్లో వర్షం రాకపోవడంతో వేరుశనగ పంట దిగుబడి పూర్తిగా తగ్గింది. సెప్టెంబరు మాసంలో వేరుశనగ పంట ఊడలు దిగే సమయానికి ముందు వర్షం వచ్చి ఉంటే మంచి దిగుబడులు వచ్చేవని రైతులు చెబుతున్నారు. దిగుబడి లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో రైతులు ఇప్పటికే పంటను దున్నేశారు. మరి కొన్ని చోట్ల అరకొర దిగుబడి రాగా, పంట కోత కోసిన తర్వాత వచ్చిన భారీ వర్షాలకు అది కూడా పాడైపోయింది. వర్షానికి తడిసిన వేరుశనగ కట్టె పశుగ్రాసానికి కూడా పనికిరాకుండా కుళ్లిపోయింది. కనీసం పెట్టుబడులు, కూలీలు ఖర్చులు కూడా రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


తొలగించిన వేరుశనగ పంట

అరకొర దిగుబడి

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 7.9 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో 1.11 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగైంది. ఇందులో ఇప్పటి దాకా 30 శాతం పంట కోత పూర్తయ్యింది. వచ్చే నెల రెండో వారానికి పంట కోతలు మొత్తం పూర్తికానున్నాయి. వేరుశనగ పంట సాగు కోసం ఎకరాకు రూ.30వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. పంట కీలక దశల్లో వర్షం పడి ఉంటే ఎకరాకు 15 నుంచి 20 బస్తాల వరకు దిగుబడి వచ్చేది. అయితే వర్షాభావం వల్ల ఎకరాకు 3 నుంచి 5 బస్తాల (ఒక బస్తా 42 కేజీలు) వరకు దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. పలు ప్రాంతాల్లో చెట్టుకు నాలుగైదు కాయలే ఉన్నాయి. జిల్లాలో వేరుశనగ పంట కోతల ప్రయోగాలు కొనసాగుతున్నాయి. తాజాగా వర్షాలు రావడంతో పంట కోత ప్రయోగాలు నిలిపివేశారు. వర్షం ఆగిపోగానే తిరిగి పంట కోత ప్రయోగాలు కొనసాగనున్నాయి.

మొత్తం లొట్టలే



మాకున్న మూడెకరాల భూమితో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ పంట సాగు చేశాం. పంట సాగు కోసం కోసం రూ.4లక్షలకుపైగా పెట్టుబడి వచ్చింది. వానలు సరిగా రాకపోవడంతో దిగుబడి రాలేదు. చెట్టుకు నాలుగైదు కాయలే ఉన్నాయి. అవి కూడా ఎక్కువ శాతం లొట్టలే. త్వరలోనే పంట కోత కోయాలి. ఎకరాకు 1 బస్తా నుంచి 2 బస్తాలు దిగుబడి కూడా వస్తుందో..? రాదో తెలియడం లేదు. ఈ సారి అప్పులు చేసి పంట వేశాం. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

- కళావతి, కౌలు రైతు, చిన్న మట్లగొంది, శింగనమల మండలం

●వ్యాపారులు కొనడం లేదు



నేను 4 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. ఎకరాకు 3 బస్తాల చొప్పున దిగుబడి వచ్చింది. వర్షం పడక ముందే పంట కోత కోసి పొలంలోనే ఉంచుకున్నా. వేరుశనగ కాయల నాణ్యంగా (ఔటన్) లేవని వ్యాపారులు ఎవరూ పంటను కొనేందుకు రావడం లేదు. వేరుశనగ కాయలు అమ్మితే కనీసం కూలీల ఖర్చులు కూడా వస్తాయో రావో అనుమానమే. పెట్టుబడుల కోసం రూ.3 లక్షలు ఖర్చు చేశా. అప్పులు చేసి పంట పెట్టా. అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు. ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు పంటను కొనుగోలు చేయాలి.

- ఆదినారాయణ, రైతు, చిన్న మట్లగొంది, శింగనమల మండలం


ఆరబోసిన వేరుశనగ కాయలు

న్యూస్‌బాక్స్

పద్మావతి ప్యానల్‌దే విజయం

- ముగిసిన ఏపీ నర్సుల సంఘం జిల్లా ఎన్నికలు

అనంతపురం టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా కొనసాగాయి. గతంలో కేవలం కొందరు సీనియర్లు చెప్పిన వారికే కమిటీలో స్థానం కల్పించి ఏకగ్రీవంగా ప్రకటించేవారు. దీనిపై గత వైసీపీ ప్రభుత్వంలో వివాదం తలెత్తడంతో నాలుగేళ్లుగా ఎన్నికలు నిలిచిపోయాయి. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీంతో జిల్లా నర్సుల సంఘం ఎన్నికలు ఈనెల 16 నుంచి జిల్లాలో మొదలయ్యాయి. ఎన్నికల అధికారిగా కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ చంద్రశేఖర్ వ్యవహరించారు. జిల్లాకేంద్రంలోని ఐఎంఏహాల్‌లో బుధవారం ఎన్నికలు నిర్వహించారు. పోలీస్ బందోబస్తు మధ్య ఈఎన్నికలు కొనసాగాయి. మొత్తం 246మంది ఓటర్లుగా నమోదైన నర్సులు 212మంది హాజరై ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటలవరకు ఎన్నికలు నిర్వహించారు. ఆతర్వాత పోలైన ఓట్లను రాత్రి 7-30గంటల వరకు లెక్కించారు. ఈలెక్కింపులో ఆర్‌బీ పద్మావతి ప్యానల్ అభ్యర్థులే విజయం సాధించారు.

నర్సుల సంఘం జిల్లా కమిటీ ఇదే...

కౌంటింగ్ అనంతరం విజేతలను ఎన్నికల అధికారి చంద్రశేఖర్ ప్రకటించారు. ఆయన వెల్లడించిన మేరకు ఏపీ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలుగా ఆర్‌బీ పద్మావతిదేవి, ఉపాధ్యక్షురాలిగా బీ.ఈ భానులత, సెక్రెటరీగా పుప్పాల లత, కోశాధికారిగా సంధ్యాఅరుణ, ఈసీమెంబర్లుగా బీసీ నారాయణ స్వామి, వె.శ్రీదేవి, జీ.ఆదిత్యాదేవి, సీ.నాగమణి, కే.అరుణ విజయం సాధించారు. ఏపీ ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, ప్రధానకార్యదర్శి చంద్రమోహన్, నగరకమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌బాబు నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

టమోటా కిలో రూ.40

అనంతపురం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.30, కనిష్ఠ ధర రూ.17పలికినట్లు ఆయన తెలిపారు.

జీడిపల్లి రిజర్వాయర్‌లో నీటి నిల్వ 1.681 టీఎంసీలు

బెళుగుప్ప, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో నీటి నిల్వ 1.681 టీఎంసీలు ఉన్నట్లు బుధవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 1239 క్యూసెక్కులు వుండగా ఔట్‌ఫ్లో హెచ్‌ఎన్‌ఎస్ఎస్ ఫేజ్-2కు 1047 క్యూసెక్కులు వెళుతున్నట్లు తెలిపారు.

25 నుంచి పశుగణన సర్వే

అనంతపురం అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 25 నుంచి 21వ భారత పశుగణన సర్వేని ప్రారంభిస్తామని పశుసంవర్థక శాఖ జేడీ వెంకటస్వామి తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి సర్వే చేయాలని నిర్ణయించినా, సాంకేతిక కారణాలతో వాయిదా పడిందని తెలిపారు. ఈ నెల 25 నుంచి నాలుగు నెలలపాటు సర్వే కొనసాగుతుందని అన్నారు. సర్వే కోసం జిల్లా వ్యాప్తంగా 189 మంది ఎన్యుమరేటర్లు, 53 మంది సూపర్‌వైజర్లను నియమించామని తెలిపారు. సర్వే వివరాలను సిబ్బంది యాప్‌లో అప్‌లోడ్ చేస్తారని అన్నారు. సర్వే సిబ్బందికి కిట్లు అందజేశామని తెలిపారు.

రూ.1.20 కోట్లు ఏటిపాలు..!



వరద ఉధృతికి కొట్టుకుపోయిన కల్వర్టు

బొమ్మనహాళ్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల కాసుల కక్కుర్తితో గ్రామీణ ప్రజలు మరోమారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వేదవతి హగరి నది వరద నీటిలో కళ్లదేవనహళ్లి - బండూరు నడుమ కల్వర్టు బుధవారం కొట్టుకుపోయింది. రోడ్డు మొత్తం గుంతలమయమైంది. బొమ్మనహాళ్ మండలంలోని కళ్లదేవనహళి-బండూరు మార్గంలో గోవిందవాడ, దర్గాహోన్నూరు, బొల్లనగుడ్డం, కళ్లహోళ, తార్కాపురం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. బండూరు, బొమ్మనహాళ్, ఉద్దేహాళ్ తదితర గ్రామాల ప్రజలు ఉరవకొండ, గుంతకల్లుకు ఈ మార్గంలోనే ప్రయాణిస్తారు. 2022లో వేదవతి వరద నీటిలో ఇదే కల్వర్టు కొట్టుకుపోయింది. వైసీపీ ప్రభుత్వం రోడ్డు మరమ్మతు, కల్వర్టు నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో కాంట్రాక్టరు బీటీ రోడ్డు, కల్వర్టును నాసిరకంగా నిర్మించారు. ఐదు పెద్ద పైపులు వేసి.. దానిపై గ్రావెల్ పరిచి పని ముగించారు. దీంతో గత ఏడాదే కల్వర్టు దెబ్బతింది. తాజాగా భారీగా వరద నీరు ప్రవహించడంతో కల్వర్టు మొత్తం కొట్టుకుపోయింది. మండల కేంద్రానికి రావాలనుకుంటే పలు గ్రామాల ప్రజలు 20 కి.మీ. చుట్టేసుకుని రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పనులను తిరిగి చేపట్టాలంటే భారీగా ఖర్చు అవుతుంది.

మళ్లీ ఇక్కడే..!



వైసీపీ హయాంలో ఒక పోలీస్‌స్టేషన్‌లో

కూటమి ప్రభుత్వంలో పక్క స్టేషన్లకు...

ఇక్కడిక్కడే తిరుగుతున్న పోలీసు అధికారులు

నగరంలో 13మంది ఎస్‌ఐల్లో 8 మంది ర్యాంకర్లే

జిల్లాకేంద్రంలో నలుగురు లక్కీ ఎస్‌ఐలు

అనంతపురం క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పార్టీ ఏదైనా పరపతి మాదే అన్న చందంగా కొందరు పోలీసు అధికారులు నిరూపించుకుంటున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఆయా పార్టీల ప్రజాప్రతినిధులతో సన్నిహితంగా మెలుగుతూ తమకు అనుకూలమైన పోలీస్‌స్టేషన్లకు పోస్టింగ్ వేయించుకుంటున్నారు. అనంతపురంలోని నాలుగు పోలీస్‌స్టేషన్లు, రూరల్ పోలీస్‌స్టేషన్, ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్లకు కొందరు పోలీస్ అధికారులు బాగా అలవాటుపడిపోయారు. వైసీపీ హయాంలో కొందరు సీఐలు పక్క పక్క స్టేషన్లకే కుర్చీలు మార్చుకుంటూ వెళ్లారు. విజయభాస్కర్ గౌడ్ టీడీపీ నుంచి వైసీపీ ప్రభుత్వం దాకా దాదాపు ఆరేళ్లలో వన్‌టౌన్, ఇటుకలపల్లి, అనంతపురం రూరల్ స్టేషన్లలోనే పని చేశారు. మరో సీఐ జాకీర్ హుస్సేన్ టూటౌన్ నుంచి ఫోర్త్‌టౌన్‌కు వచ్చారు. చివర్లో కీలకమైన ఎస్బీలో పనిచేశారు. సీఐ కత్తి శ్రీనివాసులు ఫోర్త్‌టౌన్ నుంచి త్రీటౌన్‌కు మారారు. ఇప్పుడు నగరంలో ఓ నలుగురు ఎస్‌ఐల గురించి విపరీతమైన చర్చ నడుస్తోంది. లక్కీ చాన్సంటే వాళ్లదేనంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఒకే పోలీస్‌స్టేషన్‌లో పనిచేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో పక్క పక్క స్టేషన్లకు వచ్చేశారు.

ఆ నలుగురు

టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓ నలుగురు ఎస్ఐ అటూ ఇటూ ఒకే సారి పనిచేశారు. వారిలో ఇద్దరు రెగ్యులర్ ఎస్ఐలు కాగా మరో ఇద్దరు ర్యాంకర్లు. వైసీపీ ప్రభుత్వంలో ఆ పోలీస్‌స్టేషన్‌లో రెండున్నరేళ్లకు పైగా పనిచేశారు. ఆ పోస్టింగుల్లోకి రావడానికి అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతల సాయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నలుగురూ నగరంలోనే నివాసం ఉంటున్నారు. ఎన్నికల ముందు నిబంధనల మేరకు మరో ప్రాంతాలకు బదిలీ అయ్యారు. కూటమి పార్టీలు అధికారంలోకి రాగానే వారిలో ఇద్దరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు, మరో ఇద్దరు ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు నియమితులయ్యారు. వీరంతా ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి నేతల ఆశీస్సులతోనే ఆయా పోలీస్‌స్టేషన్లలో ఆశీనులైనట్లు తెలుస్తోంది. గతంలో పనిచేసిన ఈ నలుగురినే మళ్లీ కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరో ఎస్ఐ తాను గతంలో పనిచేసిన పోలీస్‌స్టేషన్‌కే మళ్లీ రావడంపైనా చర్చ జరుగుతోంది.

సమర్థతపై సందేహాలు..!

జిల్లా కేంద్రమైన అనంతపురంలో నాలుగు పోలీస్‌స్టేషన్లు, అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ ఉంది. వీటన్నింటి పరిధిలో 13మంది ఎస్‌ఐలుండగా వారిలో 8మంది ఎస్‌ఐలు ర్యాంకర్లు కావడం గమనార్హం. వన్‌టౌన్‌లో ఇద్దరు ర్యాంకర్లు, ఒక రెగ్యులర్, టూటౌన్‌లో ఒకరు రెగ్యులర్, ఇంకొకరు ర్యాంకర్, త్రీటౌన్‌లో ఒకరు రెగ్యులర్, మరొకరు ర్యాంకర్, ఇక నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నలుగురుండగా అందులో ముగ్గురు ర్యాంకర్లు, ఒకరు రెగ్యులర్ ఉన్నారు. రూరల్‌లో ఒకరు రెగ్యులర్, మరొకరు ర్యాంకర్. జిల్లా కేంద్రంలో మట్కా, పేకాటలతో పాటు అసాంఘిక వ్యవహారాలు ఎక్కువగానే జరుగుతున్నట్లు సమాచారం. హత్యలు, మిస్సింగ్‌లు, గొడవలు, వంటి వాటివి సాధారణంగా జరుగుతూనే ఉన్నాయి. ఈ కేసులు ఛేదింపు, నేరాల నియంత్రణలో ఏ ఎస్ఐ ఎంత సమర్థుడు ఆ పరిధిని పర్యవేక్షించే సీఐలకే తెలియాలి. తాజాగా వన్‌టౌన్ సీఐ కొన్ని గొడవలు తదితర వాటిపై దృష్టి పెట్టాలని ఆదేశిస్తే...ఓ ఎస్ఐ 'ఈయనొకడు.! ఊరికే తలతింటుంటారు. ఏం జరుగుతోందని చూడాలి' అని గొణుగుతుంటారట. ఇంకొందరు ఎస్ఐల పనితీరు అలాగే ఉందని సమాచారం. వీరిలో ఎవరెవరు సమర్థవంతమైన ఎస్ఐలో వారి సీఐలకే తెలియాలి.

నవమాసాలు మోసి,
పేగును తుంచి, దేహాన్ని పంచావే..
ఎందుకు...?
కన్నులైనా తెరవక ముందే కనుమరుగయ్యేందుకా

లాలపోసి, దిష్టి తీసి
నా పుత్తడి బొమ్మ అంటూ పొంగిపోయావే
పురిటి నొప్పులైనా పోకముందే కాటికేగడానికా

జోలపాడుతూ నిదురపుచ్చితే
సాయంత్రం స్నానానికి లేపుతావనుకున్నా
అదే చివరి పాట అవుతుందని నాకేం తెలుసు
తెలిసుంటే నా ఏడుపుతోనైనా నిన్ను ఆపేదాన్ని

నీ చేతి స్పర్శ తప్ప
అన్యుల లాలన తెలియదే
నీ చనుబాల తీపి తప్ప
వేరే రుచి తెలియదే
ఎందుకమ్మా నాకు జీవిత కాల శిక్ష విధించావ్
నీవు లేని లోకంలో ఎలా బతకాలి ?
ఏ బొమ్మలో అమ్మను చూసుకోవాలి ?
ఒక్కసారి బతికి రావమ్మా..!

అమ్మా..! ఎందుకిలా చేశావ్ ?



ఆత్మహత్య చేసుకున్న రేవతి (ఫైల్)



గుక్కపట్టి ఏడుస్తున్న పసికందు ప్రేయాందిక

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం సాయంత్రం ఓ బాలింత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తమిళనాడు మధురై జిల్లాకు చెందిన మురళి, రేవతి (24) రెండు సంవత్సరాల కిందట కళ్యాణదుర్గం పట్టణానికి పొట్టకూటి కోసం వలస వచ్చారు. పట్టణంలోని దొడఘట్ట రోడ్డులో ఉన్న మార్కెట్ యార్డు సమీపంలో అద్దెకు ఇల్లు తీసుకుని చక్కిలాలు, నిప్పట్లు విక్రయించి జీవనం సాగిస్తున్నారు. 40 రోజుల కిందట రేవతి కుమార్తెను ప్రసవించింది. అయితే ఏమి జరిగిందో ఏమో తెలియదు కానీ బుధవారం సాయంత్రం ఇంట్లో భర్తలేని సమయంలో రేవతి ఉరి వేసుకుంది. బయటికి వెళ్లిన భర్త ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేసుకున్న ఉరికి వేలాడుతున్న రేవతి కనిపించింది. దీంతో అతడు చుట్టుపక్కల వారి సాయంతో రేవతిని ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి రెండేళ్ల కుమారుడు కుమారుడు ధీరేంద్రన్, 40 రోజుల పాప ప్రేయాందిక ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా తల్లపాల కోసం పసిబిడ్డ ఏడ్వడం చూపరులను కలిచివేసింది.

క్రీడలలో పాల్గొనడమే గొప్ప విజయం

హిందూపురం డీఎస్పీ మహేష్

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

చిత్తూరు బాలుర, గుంటూరు బాలికల జట్ల విజయం



బాలుర విభాగంలో విజేతగా నిలిచిన చిత్తూరు జట్టు

హిందూపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోటములు సహజమని, పోటీలలో పాల్గొనడమే గొప్ప విజయమని డీఎస్పీ మహేష్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో 68వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలబాలికల వాలీబాల్ టోర్నమెంట్ జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 600 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. బుధవారం జరిగిన బాలుర ఫైనల్స్‌లో చిత్తూరు జట్టు విజయం సాధించింది. గుంటూరు జట్టు రన్నరప్‌గా నిలిచింది. విశాఖపట్నం జట్టు మూడో స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో గుంటూరు జట్టు విజేతగా నిలిచింది. చిత్తూరు జట్టు రెండో స్థానంలో, అనంతపురం జట్టు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు. టోర్నీలో పాల్గొన్న క్రీడాకారుల నుంచి 12 మంది బాలురు, 12 మంది బాలికలను జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. వీరు నవంబరు 6 నుంచి 10 వరకు ఉత్తర ప్రదేశ్‌లో జరిగే పోటీల్లో రాష్ట్రం తరపున పోటీలలో పాల్గొంటారు. ముగింపు కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ నాయకులు మురాజీయాదవ్, ఎంఈఓ గంగప్ప, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, వాలీబాల్ క్రీడా పోటీల రాష్ట్ర అబ్జర్వర్ రమణరావు పాల్గొన్నారు.

అప్పు పేరుతో మోసం చేస్తారా?

రైతు దంపతుల ఆగ్రహం

అప్పు చేయకపోయినా చేసినట్లు చూపి తీర్చమంటున్నారని ఆవేదన



బ్యాంకు సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న బాధితులు

బెళుగుప్ప, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎంతో నమ్మకంతో మండలంలోని శివసాయిరామ్ వేర్‌హౌస్‌లో పప్పుశనగలు నిల్వ ఉంచితే మోసం చేస్తారా అని తగ్గుపర్తికి చెందిన రైతు దంపతులు నారా నరసమ్మ, కృష్ణమనాయుడు బుధవారం యజమానితో వాగ్వాదానికి దిగారు. ఈ గోడౌన్‌లో 16 నెలల కిందట 200 క్వింటాళ్ల పప్పుశనగ నిల్వ ఉంచారు. ప్రస్తుతం పప్పుశనగ విత్తుకోవాలని, నిల్వ ఉంచిన తమ పప్పుశనగ ఇవ్వాలని యజమానిని కోరారు. అయితే మీపేరుతో బ్యాంకులో శనగలపై తీసుకున్న అప్పు ఉంది. అది కట్టాలని యజమాని తెలిపాడు. దీంతో నరసమ్మ మేము ఎక్కడా అప్పు తీసుకోలేదని , మోసంతో నా భర్తతో చెక్కుపై సంతకాలు చేయించుకుని డబ్బు ఇవ్వకుండా రూ.5 లక్షలు అప్పు ఉందని చెబుతారా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. నమ్మినందుకు ఇంత అన్యాయం చేస్తారా అంటూ కన్నీటిపర్యంతమైంది. అయినా రెండు రోజుల కిందట బ్యాంకులో రూ. ఐదు లక్షలు చెల్లించి వచ్చాము. ఇప్పుడైనా మా సరుకు ఇవ్వాలని అడుగగా వ్యక్తిగతంగా తీసుకున్న రూ. రెండు లక్షలు కూడా చెల్లిస్తే మీ సరుకు ఇస్తామని మొండికేశారు. తీసుకోని అప్పును మాపై మోపారు. పంట సాగు చేసుకోవాలి ఇప్పటికిప్పుడే పాత బకాయిలు చెల్లించాలని అడుగుతున్నారు ఇదేమిటని వాపోయారు. గ్రామస్థులు ఇద్దరికి సర్దిచెప్పడంతో నిల్వ ఉంచిన పప్పుశనగ ఇవ్వడానికి యజమాని అంగీకరించారు.

బ్యాంకుల్లో అప్పు తీసుకోలేదు: మహిళా రైతు నరసమ్మ

మేము బ్యాంకులో అప్పు తీసుకోలేదు. చెక్కుపై సంతకాలు చేయించుకుని మోసం చేస్తున్నారు. గతంలో ఐపీ పెట్టిన విక్రమ్ పేరు చెబుతూ మోసపుచ్చుతున్నారు. దేవుడిపై ప్రమాణం చేస్తాను మేము ఏ అప్పు తీసుకోలేదు.

బెదిరించడంతోనే.: యజమాని రాందాసు

నరసమ్మ భర్త నేరుగా బ్యాంకుకి వచ్చి సంతకాలు చేసి అప్పు తీసుకున్నాడు. మోసపుచ్చారనడం అవాస్తవం. చెక్కులను పరిశీలిస్తే తెలుస్తుంది. మా అప్పు కట్టాలని కోరగా ఇతర ప్రాంతాలకు చెందిన వారిని పిలిపించి బెదిరించడంతోనే నమ్మకం లేక బకాయిలు పూర్తిగా చెల్లించాలని తెలిపాం.

ఒక్కొక్కరు రూ.5 వేలు..!

కప్పం కడితేనే డీలర్‌షిప్

పుట్లూరు మండలంలో దందా

ఓ అధికారి.. టీడీపీ నాయకుడి బరితెగింపు



తహసీల్దార్ కార్యాలయం



పుట్లూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాలను దక్కించుకున్న తమ్ముళ్లు అధికారులకు కప్పం కట్టాల్సి వస్తోంది. సొంత పార్టీ నాయకుడే దగ్గరుండి మరీ ఈ వసూళ్లను ప్రోత్సహిస్తున్నారు. దీంతో తమ్ముళ్లు దిక్కుతోచనిస్థితిని ఎదుర్కొంటున్నారు. పట్లూరు మండలంలో జరుగుతున్న ఈ వ్యవహారం హాట్ టాపిక్ అయింది. కాస్తో కూస్తో డబ్బులున్నవారు అడిగినంత సొమ్ము ఇస్తున్నారు. ఆర్థికంగా అంతంతమాత్రంగానే ఉన్నవారు డబ్బులు ఇవ్వకపోవడంతో 'జాబితాలో పేరు ఉంచాలా..? తీసెయ్యమంటారా..?' అని బెదిరించేదాకా వెళ్లారు. వైసీపీ హయాంలో అన్నిశాఖల్లో అవినీతి రాజ్యమేలిందన్న అభిప్రాయం ప్రజల్లో ఉంది. కూటమి అధికారంలోకి రావడంతో పరిస్థితులు మారుతాయని భావించారు. కానీ పార్టీ అధికారంలో ఉన్నా.. టీడీపీ నాయకులే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడమే దీనికి కారణం. ఒక్కో డీలర్ రూ.5 వేలు ఇవ్వాల్సిందేనని ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. ఓ టీడీపీ నాయకుడు వారికి అండగా ఉంటూ.. అక్రమ వసూళ్లకు తెరలేపాడు. నూతన రేషన్‌షాపులు వచ్చిన ప్రతి ఒక్కరూ తహసీల్దారు కార్యాలయ ఖర్చులకు ఇవ్వాలని హుకుం జారీ చేస్తున్నాడు. డబ్బులు ఇవ్వనివారికి డీలర్‌షిప్ అప్పగించడం లేదు. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఇంకా జాబితా రాలేదని తిప్పి పంపుతున్నారని బాధితులు వాపోతున్నారు.

ఇష్టారాజ్యం

కూటమి ప్రభుత్వం వచ్చాక పుట్లూరు తహసీల్దారు కార్యాలయంలో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డీలర్‌షిప్ దక్కించుకున్న నాయకులలో కొత్తవారు ఎక్కువగా ఉన్నారు. దీంతో టీడీపీ నాయకుడు, ఓ అధికారి నేరుగా వసూళ్లకు దిగారు. పుట్లూరు మండలంలో మొత్తం 37 రేషన్‌షాపులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిలో 16 దుకాణాల డీలర్‌షిప్‌లు మాత్రమే మారాయి. రెండు రేషన్ షాపులలో వీఆర్వోలు సరుకులను పంపిణీ చేస్తున్నారు. మిగిలిన 19 షాపును వైసీపీ మద్దతుదారులే నిర్వహిస్తున్నారు. వైసీపీ వారికి తహసీల్దారు కార్యాలయంలో కొంతమంది అధికారులు మద్దతుగా ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు అధికారులు చేసే తప్పుల కారనంగా మొత్తం కార్యాలయంలో పనిచేసే అందరికీ మరకలు అంటుతున్నాయని పలువురు వాపోతున్నారు.



శేషారెడ్డి, తహసీల్దార్

బఫర్‌స్టాక్ లేదట..

పాత డీలర్లు బఫర్‌స్టాక్‌ను కొత్త డీలర్లకు అప్పగించాల్సి ఉంటుంది. కానీ పుట్లూరు మండలంలో ఓ అధికారి బఫర్ స్టాక్ లేదు ఏమీ లేదు అని బెదిరింపులకు దిగుతున్నారు. బఫర్‌స్టాక్‌లో అవకతవకలు జరిగితే డీలర్లు రెవెన్యూ అధికారులకు చెప్పుకుంటారు. కానీ ఇక్కడ ఆ అధికారే అన్నీ తానై అక్రమాలకు వత్తాసు పలుకుతున్నారు. దీంతో కొత్త డీలర్లు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక ఇబ్బంది పడుతున్నారు. బఫర్‌స్టాక్ విషయంలో ఏం చేయాలో తెలియడం లేదని వాపోతున్నారు. ఒక్కొక్క డీలర్‌కు 3 నుంచి 5 క్వింటాళ్లపైనే బియ్యం తేడాలు వస్తున్నాయి. కొత్త డీలర్ల నుంచి వసూళ్లు చేయడం లేదని తహసీల్దారు శేషారెడ్డి అన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

క్రైం కార్నర్

గ్యాంగ్‌రేప్ కేసులో ఆరో నిందితుడి అరెస్టు

- వీరి బాధితులుంటే నిర్భయంగా ఫిర్యాదు చేయండి: ఎస్పీ రత్న



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన అత్తాకోడలిపై గ్యాంగ్‌రేప్ కేసులో పరారీలో ఉన్న నిందితుడు చాకలి శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయం(డీపీఓ)లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుడి అరెస్టు వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఈనెల 11వ తేదీ అర్ధరాత్రి దాటాక చిలమత్తూరు మండలంలో నిర్మాణంలో ఉన్న మిల్లు వద్దకు ఆరుగురు రెండు బైక్‌లపై వచ్చారు. మిల్లు వాచ్‌మన్ కుటుంబంలోని అత్తాకోడలిపై అత్యాచారానికి ఒడిగట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు చిలమత్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిని తీవ్రంగా పరిగణించి, ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటుచేశారు. 48 గంటల్లోనే ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో నిందితుడు చాకలి శ్రీనివాసులు కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటుచేసి, గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఈనెల 22న హిందూపురం మండలం పూలకుంట గ్రామ శివారులోని ఆదిరెడ్డి పొలం వద్ద నిందితుడు చాకలి శ్రీనివాసులును అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడిపై హిందూపురం రూరల్ పోలీసుస్టేషన్లో డీపీడీ కేసు, వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యం రవాణా కేసులున్నాయన్నారు. పలు అత్యాచార, చోరీ కేసుల్లో నిందితుడని ఎస్పీ వివరించారు.

బాధితులు నిర్భయంగా ముందుకురండి

గ్యాంగ్‌రేప్ నిందితుల బాధితులు ఉంటే నిర్భయంగా ముందుకొచ్చి, జిల్లా పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ రత్న కోరారు. న్యాయం చేస్తామన్నారు. హిందూపురం ప్రాంతంలోని బిట్స్ కాలేజీ, ఇందిరమ్మకాలనీ, గుడ్డం బ్రిడ్జి, గుడ్డం చెరువు, కనుమ, చిలమత్తూరు, లయోలా కాలేజీ, రైల్వేట్రాక్, బేకులోడు, ఆటోనగర్ ప్రాంతాల్లో గతంలో రేప్‌కేసు నిందితులు పలు నేరాలకు పాల్పడ్డారని తెలిసిందనీ, బాధితులు ఉంటే పోలీసులను ఆశ్రయించాలని ఎస్పీ కోరారు.

ప్రాణం తీసిన వాటర్ హీటర్



రోదిస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు



శ్రీవల్లి(ఫైల్)

బడికి వెళ్లే సమయమౌతోంది. త్వరగా తయారవ్వాలని బాత్ రూంలోకి వెళ్లింది చిన్నారి శ్రీవల్లి. బకెట్ నీటిలో అప్పటికే హీటర్ ఆన్‌చేసి పెట్టారు. పొరపాటున ఆ చిన్నారి హీటర్‌ను పట్టుకుంది. విద్యుదాఘాతానికి గురై సొమ్మసిల్లి పడిపోయింది. ఆ శబ్దానికి అప్రమత్తమైన కుటుంబ సభ్యులు.. వెంటనే వెళ్లి చూశారు. కదలికలు లేని చిన్నారిని ఆత్రంగా ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పాప మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషాద ఘటన కనగానపల్లి మండలం చంద్రాచర్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పసల నరసింహులు, నాగలీల దంపతులకు ముగ్గురు పిల్లలు. పెద్ద కూతురు శ్రీవల్లి(9) గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. అనుకోని ప్రమాదం పసి బిడ్డ ప్రాణాలను తీయడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. గ్రామంలో విషాదం అలుముకుంది.

- కనగానపల్లి, ఆంధ్రజ్యోతి

కాల్పుల కేసులో కారు స్వాధీనం

బత్తలపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం వద్ద ఈనెల 20వ తేదీన కలకలం రేపిన కాల్పుల ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కాల్పులకు పాల్పడిన దుండగుల కారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ కాల్పుల కేసును ఎస్పీ రత్న సీరియస్‌గా పరిగణించారు. నిందితులను పట్టుకునేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ముమ్మర గాలింపు చేపట్టారు. తెలంగాణ గ్యాంగ్ ఉపయోగించిన కారును బుధవారం బత్తలపల్లి పోలీసులు కర్ణాటక రాష్ట్రం శిరిగుప్పలో స్వాధీనం చేసుకున్నారు. బత్తలపల్లికి తీసుకొచ్చారు. తెలంగాణకు చెందిన అరవింద్ తెలంగాణ గ్యాంగ్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇతడు తెలంగాణలో యూట్యూబ్ చానల్ నడుపుతున్నట్లు తెలుస్తోంది. మరో గ్యాంగ్ వారు అన్నమయ్య జిల్లా విరుపల్లె మండలం షికారుపాలెంకు చెందినవారని సమాచారం.వీరి కోసం మరో పోలీసు బృందం తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో గాలిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో అనేక నేరాలకు పాల్పడినట్లు సమాచారం.

క్లుప్తంగా..

27న జిల్లాస్థాయి చెకుముకి పరీక్ష

కదిరి అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాధన ప్రైవేటు పాఠశాలలో ఆదివారం చెకుముకి జిల్లాస్థాయి పరీక్ష నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు మహేంద్రరెడ్డి, నరసారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తె లిపారు. గతంలో మండలస్థాయి చెకుముకి పరీక్షల్లో విజేతలైన విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకావాలన్నారు. అదే రోజు మండలస్థాయి విజేతలకు ప్రసంసాపత్రాలు, మెమెంటోలు అందచేస్తామన్నారు.

భూసమస్యలపై గ్రామసభ

గాండ్లపెంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సామ చేనుబైల్లో భూ రీసర్వే సమస్యలపై బుధవారం గ్రామసభ నిర్వ హించారు. మొత్తం తొమ్మిది వినతులు వచ్చినట్లు తహసీల్దార్ బాబురావు తెలిపారు. ఇందులో సీనియర్ అసిస్టెంట్ జాఫర్‌వలీ, వీఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

నేడు కురమాలలో ...

నల్లమాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కురమాల సచివాలయం వద్ద గురువారం భూరీసర్వే గ్రామసభను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రంగనాయకులు తెలిపారు. కురమాలలో భూసమస్యలున్న రైతులు.. ఈసభ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

తహసీల్దార్‌గా బాబురావు

గాండ్లపెంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ వేణుగోపాల్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. దీంతో ఇక్కడి డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బాబురావును తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

బుక్కపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చయ్యగారిపల్లి, గునిపల్లి, సిద్దరాంపురం, కొత్తకోట, మరాల గ్రామాల్లోని పాఠశాలల్లో బుధవారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొనంకి చంద్రశేఖర్‌నాయుడు, కౌన్సిల్ సభ్యులు సామకోటి మల్లికార్జున, హనుమంతు, రామచంద్రరాజు, మండల కమిటీ సభ్యులు గోపాల్, రామాంజనేయులు, క్రిష్టప్ప పాల్గొన్నారు.

తూనికలు, కొలతల పరిశీలన

కొత్తచెరువు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని చౌకధాన్యపు దుకాణాల్లో బియ్యం తూకాలు వేసే స్కేళ్ల నిర్వహణను తూనికలు కొలతల సీఐ మహమ్మద్‌గౌస్ బుధవారం పరిశీలించారు. సక్రమంగా ఉన్న వాటికి సంవత్సరం పాటు సర్టిఫికెట్ అందజేశారు. తూకాలు.. కొలతల్లో మార్పుచేయకుండా వాటికి సీల్ వేశాడు. వాటిని ఎవరైన తొలగిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీలకంఠారెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

మట్టి పరీక్షలపై శిక్షణ

తనకల్లు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుసేవా కేంద్రంలో బుధవారం మట్టిపరీక్షలపై ఉద్యానవన శాఖ డిజిటల్ గ్రీన్ ట్రస్టు ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ నిర్వహించారు. మట్టి పరీక్షల మేరకు పంటలను సాగు చేస్తే మంచి దిగుబడి పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్ ప్రతినిధులు శ్రీకాంత్, రేఖ, ఉద్యనవానశాఖాధికారి లావణ్య, మండలంలోని రైతు సేవాకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకం పూర్తి చేయండి

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : త్వరతగతిని పండ్ల తోటల పెంపకం కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఏపీడీ జ్యోతి, ఎంపీడీఓ రాబర్టు విల్సన్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అమడగూరు, ఓడీసీ మండలాల ఉపాధి సిబ్బందితో వారు సమీక్ష నిర్వహించారు. మండలాలవారీగా పండ్లతోటల పెంపకం ఎన్ని ఎకరాల్లో చేపట్టారు... ఇంకా ఎన్ని ఎకరాలు చేపట్టాలనే వాటిని ఆరాతీశారు. మిగిలిన వాటిని ఈనెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. కూలీల శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు సుధాకర్, అమరావతి, ఈసీలు ఆనంద్, ఆంజనేయులు, సాంకేతిక, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైపల్లిలో ఎనుమలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మునిచంద్రిక సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే ఫ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నగేష్, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పీలు లక్ష్మీనారాయణమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను బకాయిలపై దృష్టి సారించండి

ధర్మవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దీర్ఘాకాలికంగా పెండింగ్‌లో ఉన్న పన్నుల బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సిబ్బందికి సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో రెవెన్యూ అధికారులు, సచివాలయ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సమావేశ నివేదిక ఆధారంగా ఆస్థి అంచనాల పెరుగుదల, పన్నుసేకరణలో మెరుగుదల సమీక్షించారు. అదేవిధంగా కొత్తపన్నులు విధించడం, తక్కువగా అంచనా వేసిన ఆస్తుల పన్నులను సరిచేయాలని ఆదేశించారు. షాపుగదుల అద్దె వసూళ్లపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. నీటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు.

బదిలీ ఎస్ఐకి సన్మానం



ఎస్ఐ క్రిష్ణవేణిని సన్మానిస్తున్న పోలీసులు

గాండ్లపెంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్ఐ క్రిష్ణవేణి తాడిమర్రికి బదిలీ కావడంతో ఆమెను పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రంగ, హెడ్‌కానిస్టేబుల్ తిరుమలరెడ్డి, భాస్కర్, మురళి, గురుప్రసాద్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరసింహులు, బాషా, మహి ళ పోలీసులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల కమిటీ ఎంపిక


అధ్యక్షుడు ఆదిశేషారెడ్డి

తనకల్లు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీపీయూఎస్‌ఎంఏ (ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్‌ఎయిడెంట్ స్కూల్ మ్యానేజ్‌మెంటు అసోషియేషన్) కదిరి డివిజన్ కమిటీని ఎంపిక చేశారు. కదిరి డివిజన్‌లోని ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు కదిరిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌లోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ బి. ఆదిశేషారెడ్డిని అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా హమానుల్లా, కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి, కోశాధికారిగా కార్తిక్‌ను ఎంపిక చేశారు.

వసతులు మృగ్యం..!


స్టోర్ రూంలుగా స్నానాల గదులు

- సమస్యల నిలయం.. బీసీ వసతి గృహం
- కానరాని పారిశుధ్యం
- కంపుకొడుతున్న మరుగుదొడ్లు
- బెంబేలెత్తిస్తున్న దోమలు

బీసీ బాలుర వసతి గృహం.. పేరుకే వసతి గృహం... అందులో కనీస సౌకర్యాలు కూడా లేవు. మొత్తం అపరిశుభ్రతే. సమీపంలోనే చెరువు ఉండటంతో విషపురుగులు వస్తుంటాయి. ఈ వసతి గృహం ఆవరణంలో ఏకంగా పాము పుట్టే ఉంది. ఆ వసతి గృహంలోని పిల్లలు యోగక్షేమాలు పట్టించుకోవాల్సిన వార్డెన్ అసలు అందుబాటులోనే ఉండరు. ఇంతకు ఇది ఏ మారుమూల ప్రాంతంలో ఉన్న హాస్టలో అని అనుకుంటే పప్పులో కాలేసినట్లే. ఇది సాక్ష్యాత్తు జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహం. జిల్లా కేంద్రంలోని హాస్టల్ దుస్థితి ఇలా ఉన్నా.. పాలకులు, ఉన్నతాధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం.


తలుపులు లేని మరుగుదొడ్లు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక గణేష్ కూడలిలోని బీసీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులు సవా లక్ష సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇందులో 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదుకునే 87 మంది విద్యార్థులు ఉన్నారు. కనీస సౌకర్యాలు లేక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ మొత్తం అపరిశుభ్రతే. మరుగుదొడ్లు, బాత్‌రూముల నిర్వహణ మరీ ఘోరం. ఏ ఒక్క మరుగుదొడ్డికీ తలుపులు లేవు. ఆ హాస్టల్ ఎదుటే చెరువు ఉంది. దీంతో విషపురుగులు, పాములు హాస్టల్‌లోకి వస్తుంటాయి. ఈ హాస్టల్ ఆవరణం ఏకంగా పాముల పుట్టే ఉందంటే.. ఈ హాస్టల్ నిర్వాహకులు చిన్నారుల భద్రత పట్ల ఎంత అప్రమత్తంగా ఉన్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇక దోమల బెడద వర్ణనాతీతం. వసతి గృహం కిటికీలకు, తలుపులకు కనీసం మెష్‌లు కూడా లేవు. ఉన్న ఫ్యాన్లూ పని చేయవు. ఇక పాచిపట్టిన తొట్టిలోని నీటితోనే ఈ విద్యార్థులు స్నానం చేయాలి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అనేక మంది విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. వసతి గృహంలోని పిల్లలను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన వార్డెన్.. అసలు అందుబాటులోనే ఉండరు. వసతి గృహానికి సమీపంలోనే నివాసముండాలని నిభందనలున్నా... వార్డెన్ ఆ దరిదాపుల్లో కూడా ఉండటం లేదు. పట్టించుకునే నాథుడే లేక... ఎవరికి చెబితే సమస్యలు పరిష్కారం అవుతాయో తెలీక.. చిన్నారులు బిక్కు.. బిక్కు.. మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తమ పిల్లలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆ పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. భోజనం అధ్వానంగా ఉంటోందని, ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంతోనే ఈ దుస్థితి ఏర్పడిందని, జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


హాస్టల్ ప్రాంగణంలో ఉన్న పుట్ట


కిటికీకి చిల్లులు పడిన మెష్


పాచిపట్టిన నీటితొట్టె

అమరవీరుల సంస్మరణ సభ

ధర్మవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అమర వీరుల స్మారక ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన బుధవారం పట్టణంలోని కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సంస్మరణ సభను నిర్వహించారు. తిరుపతి వద్ద స్మగ్లర్ల చేతిలో మరణించిన బిల్లే గణేశ్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి టూ టౌన్ సీఐ రెడ్డప్ప, 14వ బెటాలియన్ ఆర్ఐ ప్రదీప్‌కుమార్, కుటుంబసభ్యులు, సీపీఐ నియో జకవర్గ కార్యదర్శి మధు పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, హిందీపండిట్ వేణుగోపాల్, పీఈటీ నాగేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ధర్మవరంరూరల్ : ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్ఐ శ్రీనివాసులు బుధవారం నిర్వహించారు. పోలీసు అమరవీరుల త్యాగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.


చంద్రశేఖర్ తల్లిని పరామర్శిస్తున్న ఎస్పీ, గణేశ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు

బాధిత కుటుంబసభ్యులకు ఎస్పీ పరామర్శ

పుట్టపర్తిరూరల్ : నక్సలైట్ల కాల్పుల్లో చంద్రశేఖర్ మరణించిన విషయం తెల్సిందే. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అతని తల్లి నారాయణమ్మను ఎస్పీ వీ రత్న బుధవారం పరామర్శించారు. మండలంలోని బీడుపల్లిలో వారి స్వగృహానికి వెళ్ళి ఆమెను పరామర్శించారు. ఎస్పీ వెంట డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ సునీత ఉన్నారు. కాగా, కానిస్టేబుల్ చంద్రశేఖర్ 1993లో ఉద్యోగంలో చేరారు. 2003లో రామగిరి పోలీసుస్టేషన్లో విధి నిర్వహణలో ఉన్న చంద్రశేఖర్ నక్సలైట్‌కాల్పుల్లో మరణించారు.


సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

సభ్యత్వ నమోదుపై అవగాహన

ధర్మవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుపై స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సభ్యత్వం తీసుకోవడం కలిగే ప్రయోజనాలను పార్టీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ నాయకులు, కార్యకర్తలకు వివరించారు. రూ. వందతో సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల వరకు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. సభ్యత్వ నమోదులో ధర్మవరం నియోజకవర్గం ముందుండేలా అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, చిగిచెర్ల ఓబిరెడ్డి, చింతలపల్లి మహేశ్‌చౌదరి, కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి, పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, నాగూర్ హుస్సేన్, రాళ్ళపల్లిషరీఫ్, అత్తర్‌రహీంబాషా, అంబటి సనత్, మేకల రామాంజి, బొట్టుకిష్ట, అస్లాం పాల్గొన్నారు.

త్వరలో క్రికెట్ శిక్షణ కేంద్రాల ఏర్పాటు

కొత్తచెరువు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అన్ని జిల్లాలు, నియోజకవర్గాల కేంద్రాల్లో క్రికెట్ శిక్షణ కేంద్రాలను త్వరలో ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోషియేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ విజయకుమార్ అన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడారు. జిల్లాలో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆంధ్రక్రికెట్ అసోషియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్‌ను జిల్లా అసోషియేషన్ మెంబరు విజయ్ ఈనెల రెండో తేదీన కలిసి వినతిపత్రం అందించారన్నారు. ఆ కేంద్రం ఏర్పాటులో భాగంగానే కొత్తచెరువులో ఈ క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు నెట్ ప్రాక్టీస్ కోర్టును ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తామన్నారు. ఆయన వెంట కడప జిల్లా క్రికెట్ స్టేడియం చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, జిల్లా క్రికెట్ అసోషియేషన్ మాజీ సెక్రటరీ సాగర్, ఆంధ్రాక్రికెట్ అసోషియేషన్ సభ్యులు రమేశ్ ఉన్నారు.

కాలువపై వంతెన నిర్మించండి

బత్తలపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పుమడుగు వద్ద కాలువపై వంతెనను నిర్మించాలని రైతులు, టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకాలువను డీఈ మహేశ్వరరెడ్డి, ఏఈ నాగభవ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, టీడీపీ నాయకులు వారితో మాట్లాడుతూ... కాలువకు నీరు వచ్చినప్పుడల్లా వేల్పుమడుగు నుంచి సంగాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అంతేకాకుండా అనేకమంది రైతుల పొలాలు అటు వైపు ఉన్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, సురేంద్ర, కేశవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు కమిషనర్ ప్రమోద్ కుమార్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్, లక్ష్మీనారాయణ కమిషనర్‌తో మాట్లాడారు. కరోనా సమయంలో తీసుకున్న కార్మికులందరినీ ఆప్కాస్‌లో చేర్చాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని, చనిపోయిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియాను వెంటనే చెల్లించాలని కోరారు.

అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వద్దు

సత్యసాయి జయంతికి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టండి : ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలో అడ్డుగోలు, అక్రమ నిర్మాణాలకు ఎట్టి పరిస్థితులోనూ అనుమతులు ఇవ్వరాదని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ తుంగా ఓబుళపతి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. నవంబరులో జరిగే సత్యసాయి 99వ జయంతి వేడుకలకు అవసరమైన ఏర్పాట్లను ముందస్తుగా చేపట్టాలని సూచించారు. పలు వార్డుల్లో తాగునీరు, డ్రైనేజీ, వీధిలైట్ల సమస్య ఉన్నట్టు కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆ సమస్యలు పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పని అధికారులను హెచ్చరించారు. పట్టణంలో ధ్వంసమైన రోడ్లు బాగుచేయాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రహల్లాద, కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు కుట్ర

కదిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తలుపులలో ఓ ప్రైవేట్ వైద్యుడు తన భూమికి ఆనుకొని ఉన్న పట్టుపరిశ్రమ శాఖకు చెందిన భూమిని కబ్జా చేయడానికి కుట్రపన్నాడు. అందులో భాగంగా ప్రభుత్వ భూమికి వేసిన కంచెను తొలగించాడు. ఈ కబ్జాను అడ్డుకోవాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్‌ను వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, ప్రభుత్వ భూమిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని అన్నారు. కాగా, ఈ వైద్యుడు మండలంలోని కొరుగుట్టపల్లి వద్ద వంకను ఆక్రమించి, చెట్లు పెట్టిన విషయం గతంలో ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. అలాగే మండల కేంద్రం నుంచి ఓబులరెడ్డిపల్లికి వెళ్లే దారిలో తలుపుల గ్రామానికి సమీపంలో ఆర్‌అండ్‌బీ స్థలాన్ని కబ్జా చేసి, షాపింగ్ కాంప్లెక్సు నిర్మించడానికి ప్రయత్నించగా ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది.

ఆత్మహత్యకు కారకులకు అరెస్ట్ చేయాలి

కదిరి అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రదొడ్డి గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్ ఆత్మహత్యకు కారకులైనవారిని అరెస్టు చేయాలని మృతుని అన్న శ్రీనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ వద్ద సీఐని కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం శ్రీనాథ్ మాట్లాడుతూ... ' నా తమ్ముడు ఉదయ్‌కుమార్ 2021లో సిద్దిపేటకు చెందిన అమ్మాయిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. దీంతో అమ్మాయి తల్లిదండ్రులు ఉదయ్‌పైన కేసు పెట్టారు. ఆ కేసు విషయంలో అప్పటి రూరల్ సీఐ తమ్మిశెట్టి మధు, సిద్ధపేట సీఐ శ్రీనివాసులు ఉదయ్‌ని అరెస్టు చేసి శరీరకంగా, మానసికంగా హింసించారు. ఈ ఇద్దరు సీఐల పైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాము. అప్పటి నుంచి ఆ కేసు వెనక్కు తీసుకోవాలని సీఐలు నా తమ్ముని వేధించేవారు. వాటిని తాళలేక గత నెల 27న ఎర్రదొడ్డి సమీపంలో అతను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అదేరోజు మేం సీఐలపై కేసు పెట్టాము. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ కేసులో పురోగతి లేదు. మాకు పోస్టుమార్టం రిపోర్టుకూడా ఇవ్వలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.' అని అన్నారు.

క్రైం న్యూస్

మహిళ ఆత్మహత్య

కదిరి అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమనాయునిపాళ్యంలో షాన్వాజ్ భార్య రోషిణి (21) పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్య చేసుకుంది. ఆమె స్వగ్రామం ఓడీసీ మండలం కొండకమర్ల. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె పురుగుల మందు తాగింది. అనంతరం గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై రూరల్ సీఐని అడుగగా, తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదన్నారు. కాగా, ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు.

జీవితంపై విరక్తి చెంది యువకుడు ..

నల్లచెరువు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేమన్న గుడి సమీపంలో నివాసమున్న జి. వెంకటేష్ (26) అదే ప్రాంతంలోని బండ చింత చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతను మద్యానికి బానిసై, ఇంటిలో ఎప్పుడు గొడవపడేవాడు. దీంతో అతని భార్య యశోదమ్మ పుట్టినింటికెళ్లింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను మంగళవారం బండ చింత చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం గ్రామస్థులు ఈ విషయాన్ని గమనించి.. పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోలీసులు కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ మగ్బుల్‌బాషా తెలిపారు.

వైసీపీ నాయకుల అరెస్ట్

తాడిమర్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లవారిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కాటమయ్యపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం ఏకపాదంపల్లిలో జరిగిన పల్లెపండుగ కార్యక్రమంలో ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. కాటమయ్య చిల్లవారిపల్లి కాటకోటేశ్వరం ఆలయంలో జరుగుతున్న రాజకీయాల గురించి శ్రీరామ్‌కు వివరించారు. ఈ విషయం తెలుసుకున్న కాటకోటేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, చిన్న ఓబిరెడ్డి, బాలిరెడ్డి, సోమిరెడ్డి సోమవారం రాత్రి కాటమయ్య ఇంటికి వెళ్లి అతనిపై దాడి చేశారు. దీంతో కాటమయ్య కుడికాలు విరిగింది. ఎడమకంటికి గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్నాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఆ నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నాగాస్వామి బుధవారం తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న మాజీ వలంటీర్..

తనకల్లు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపల్లి గ్రామానికి చెందిన మాజీ వలంటీర్ కార్తీక్ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వైసీపీ పాలనలో వలంటీర్‌గా ఉన్న ఇతను కర్ణాటక నుంచి అక్రమం మద్యం తీసుకొచ్చి విక్రయించడానికి అలవాటు పడ్డారు. నేటికీ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గుర్తించిన పోలీసులు.. బుధవారం ఉదయం దాడులు నిర్వహించారు. అతను విక్రయానికి ఉంచిన 90 ఎంఎల్ 180 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరు పరచగా, 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ గోపీ చెప్పారు.

బస్సు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

కదిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని పులివెందల వద్ద బుధవారం జరిగిన బస్సు ప్రమాదంలో తలుపుల మండలానికి చెందిన ఐదుగురు గాయపడ్డారు. కదిరి నుంచి పులివెందలకు వెళ్త న్న పులివెందల ఆర్టీసీ డిపో బస్సు అదుపు తప్పి... పులివెందల కంపోస్టు యార్డ్ వద్ద ఉన్న లోయలో పడిపోయింది. అందులో ప్రయాణిస్తున్న తలుపుల మండలం ఉడమలకుర్తికి చెందిన పల్లె నాగభూషణం, ఏపులపల్లికి చెందిన ప్రసన్న, సంజనా, మూలపల్లికి చెందిన దీపికా, తలుపులకు చెందిన గంగార్జున గాయపడ్డారు. వీరిని పులివెందుల ఆసుపత్రికి తరలించారు. వీరిలో పల్లె నాగభూషణ పరిస్థితి విషయంగా ఉంది.

అలరించిన సంగీత విభావరి

పుట్టపర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి భక్తులు సంగీతగానంతో సందర్శకులను అలరింపచేశారు. బుధవారం అనకాపల్లి జిల్లా భక్తులు పర్తియాత్ర పేరుతో ప్రశాంతినిలయానికి చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంతు మందిరంలో సంగీత విభావరి పేరిట సంగీత గానకచేరి నిర్వహించారు. గంటపాటు సత్యసాయి ప్రేమతత్వంపై భక్తిగీతాల ఆలపించారు.



చిలమత్తూరు చెరువు కాలువకు గండి


లాలేపల్లి సమీపంలో కాలువకు పడిన గండి

చిలమత్తూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు పెద్ద చెరువుకు నీళ్లు వచ్చే ప్రధాన కాలువకు గండి పడింది. కర్ణాటకలో కురిసిన భారీ జర్షంతో కుషావతి పొంగి ప్రవహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ నది నుంచి చెరువుకు నీళ్లు వచ్చే ప్రధాన కాలువకు లాలేపల్లి గ్రామ సమీపంలో పెద్ద గండిపడి పెద్ద ఎత్తున నీరు బీడు పొలాలపై పారుతూ మళ్లీ కుషావతిలో కలుస్తోంది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కాలువకు గండి పడి 24 గంటలు గడుస్తున్నా అధికారులు స్పందించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

లేపాక్షి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మైదుగోళం క్రాస్‌వద్ద ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో మహిళ మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కర్నాటక డి-పాళ్యంకు చెందిన రియాజ్, హసీనా(45) ద్విచక్రవాహనంలో లేపాక్షి వైపు వస్తున్నారు. మైదుగోళం గ్రామం నుంచి ట్రాక్టర్ అతివేగంగా ప్రధాన రహదారిలోకి దూసుకొచ్చి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్య హసీన అక్కడికక్కడే మృతిచెందగా భర్త రియాజ్‌కు తీవ్రగాయాలయ్యాయి. 108సాయంతో క్షతగాత్రులను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటలక్ష్మమ్మ

లేపాక్షి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ వెంకటలక్ష్మమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ లేపాక్షి ప్రధానరహదారిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి జాతీయ రహదారి వరకు పునర్నిర్మించాలన్నారు. ప్రభుత్వ అధికారులు పలు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులకు వివరాలు అందించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ రైతులను ఆదుకోవాలి

చిలమత్తూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు బుధవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ప్రవీణ్, రామచంద్ర, నరసింహ, మంజు, గోపాలప్ప, గంగరాజు తదితరులు కలిసి మండల వ్యవసాయాధికారికి వినతి పత్రం అందజేశారు. తీవ్ర వర్షాలతో వేరుశనగ పంట దెబ్బతిందని, కోసిన పంట ఇంటికి రాకుండానే పొలాల్లో పాడైందన్నారు. ఒక పక్క అధిక పెట్టుబడి, కాయకష్టంతో పంటను పండిస్తే ఇలా వర్షాలకు నాశనమైందన్నారు.

రూటా జిల్లా కమిటీ ఏర్పాటు

గోరంట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) సత్యసాయి జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు రూటా వర్కింగ్ ప్రెసిడెంట్ ఫైరోజ్ అహమ్మద్ బుధవారం ఓప్రకటనలో తెలిపారు. రూటా జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులుగా పెనుకొండ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం ఫజిలే కరీమ్, అధ్యక్షులు కొత్తచెరువు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మహమ్మద్‌షమీవుల్లా, ప్రధాన కార్యదర్శి పరిగి ఉర్దు ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు నిషారుల్లాహ్, కోశాధికారిగా కొడిగినహళ్లి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు ఖాజావలీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చెప్పారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం

హిందూపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : వాల్మీకి అందరికీ ఆదర్శ ప్రాయుడని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్ అన్నారు. బుధవారం మునిసిపాలిటీ పరిధిలోని కొట్నూరులో వాల్మీకి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఉన్న వాల్మీకి విగ్రహం వద్ద జ్యోతులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ బాలాజీ, కొట్నూరు వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.40వేలు విరాళం


ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్నసీఐ రామకృష్ణ

గోరంట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వానవోలు గ్రామంలో శ్రీరంగనాథస్వామి నూతన ఆలయ నిర్మాణానికి పూల రామక్రిష్ణ రూ.40,116లను విరాళంగా ఇచ్చారు. పెట్లగుట్టపల్లికి చెందిన పూల పెద్ద వెంకటరామప్ప జ్ఞాపకార్థం కర్నూల్ జిల్లా సీఐగా పనిచేస్తున్న రామక్రిష్ణ తమ విరాళాన్ని కమిటీసభ్యులకు అందించారు.

రొద్దం ఎంజేపీ పాఠశాలకు రూ.లక్ష విరాళం


పెనుకొండ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలకు టీడీపీ నాయకులు హరీష్ రూ.లక్ష విరాళం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. బుధవారం రొద్దం మండలంలోని ఎంజేపీపాఠశాలలో విద్యార్థుల కనీస సౌకర్యార్థం మంత్రి సవిత ఆదేశాల మేరకుటీడీపీనాయకుడు హరీష్ రూ.లక్ష నగదు పాఠశాల ప్రిన్సిపాల్ అనితకు అందజేశారు.

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పెనుకొండ రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లుసూచించారు. బుధవారం కస్తూరీబా రెసిడెన్సియల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వరదెంత వచ్చినా...

దుర్భిక్షమే


దెబ్బతిన్న సువర్ణముఖి నదికి అడ్డంగా నిర్మించిన కట్ట

- భారీ వర్షాలకు కోతకుగురై దెబ్బతిన్న సువర్ణముఖి ఆనకట్ట
- వర్షాలు వచ్చినప్పుడల్లా వృథా అవుతున్న నీరు
- నీటిని ఒడిసి పడితే 3వేల ఎకరాలు సాగులోకి..
- రూ.12 కోట్లతో ప్రతిపాదనలు... నేటికీ మంజూరు కాని నిధులు

మడకశిర, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : సువర్ణముఖి నది కాలువలకు పలుచోట్ల పడిన గండ్లు మరమ్మతులకు నోచుకోక పోవడంతో వర్షాలు కురిసి నది పారినప్పుడల్లా నీరు వృథాగా పోతోంది. దిగువ ప్రాంతంలోని కర్ణాటక ప్రాంతానికి నీరు ఎక్కువగా పోతోందని ఈ ప్రాంతం రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు పూర్తయితే చెరువులకు నీరు చేరి దాదాపు 0.1టీఎంసీల నీరు ఆదా కావడమే కాకుండా మూడు వేల ఎకరాల భూమి సాగు లోకి వచ్చే అవకాశం ఉందని రైతన్నలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురవకపోతే చెరువుల్లో నీరు లేక పోతే అగళి ప్రాంతంలో 1000 అడుగులు తవ్వినా చుక్క నీరు దొరకడం లేదు. మూడు సంవత్సరాలు క్రితం హెచ్‌డి హళ్లి గ్రామం పరిధిలో 30 బోర్లు తవ్వితే ఒక బోరులో మాత్రమే అర కొర నీరు పడింది.


ఇరిగేపల్లి చెరువుకు వెళ్లె కాలువ కోతకు గురైన దృశ్యం

వర్షాధారిత పంటల పై నే ఆధారం

ఎటువంటి సాగునీటి వనరులు లేక పోవడంతో ఈప్రాంత రైతులు వర్షాధారిత పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పొలాలను బీడుగా వదిలివేయడంతో భూములు బండబారి పోతున్నాయి. వేసవి ప్రారంభం అయిందంటే తాగునీటి సమస్య తీవ్రంగా ఉంటోంది.

అగలి మండలంలో 17 కిలోమీటర్లు పారనున్న సువర్ణముఖి

కర్ణాటక రాష్ట్రం సిద్దలకొండలో పుట్టిన సువర్ణముఖి నది మడకశిర నియోజకవర్గంలోని అగలి మండలంలో దాదాపు 17 కిలోమీటర్ల దూరం ప్రవహిస్తుంది. కర్ణాటక సరిహద్దు ప్రాంతం అయిన మడకశిర నియోజకవర్గంలో ఎటువంటి సాగునీటి వనరులు లేక పోవడంతో ఈ ప్రాంతం రైతులు వర్షాధారంగా, బోర్ల కింద పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి నది, కాలువలు పారితే నే ఈ మండంలో అగలి , ఇరిగేపల్లి, మధూడి, కొమరేపల్లి, కెంకర, ఆలూడి తదితర గ్రామాల చెరువులకు నీరు చేరుతాయి.

తెగి పోయిన అడ్డుగోడలు

కర్ణాటక ప్రాంతంలోని సజ్జేహోసనహళ్లి వద్ద నదికి అడ్డంగా గోడ కట్టి నీటిని కట్టు కాలువ ద్వారా అగలి చెరువుకు తీసుకుని వచ్చేవారు. అడ్డంగా కట్టిన గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అవి కూడా వర్షాలకు తెగి పోవడంతో వాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. అగలి మండలం ఆర్‌జి పల్లి వద్ద కాలువ తెగిపోవడంతో నీరు వృథాగా వెళ్ళి తిరిగి నదిలోకే చేరుతోంది. ఇరిగేపల్లి చెరువుకు నీటిని మళ్ళించడానికి నందరాజన గ్రామ సమీపంలోఅడ్డుగోడ నిర్మించారు. గత సంవత్సరం కురిసిన భారీవర్షాలకు అడ్డుగోడ సైతం కోతకు గురైంది. దీంతో ఇరిగేపల్లి చెరువుకు నీరు రాకుండా పోయిందని వాపోతున్నారు.

కట్టకాలువ తెగి రెండేళ్లయింది


రైతు దొడ్డయ్య

గత రెండుసంవత్సరాల క్రితం కురిసిన భారీవర్షాలకు నది ఉధృతంగా ప్రవహించడం వల్ల నది కట్ట కాలువ కోతకు గురై తెగిపోడంతో ఇరిగే పల్లి చెరువుకు నీరు పోడం లేదు.ెగి పోయిన కట్ట కాలువ ను అధికారులు వెంటనే మర్మత్తులు చేపట్టాలి.

రూ.12 కోట్లతో ప్రతిపాదనలు

సువర్ణముఖినది పై ఉన్న అడ్డుగోడలు దెబ్బతిన్న వాటికి, కోతకు గురైన నది కట్టకాలువల మర్మత్తులు చేపట్టడానికి రెండు సంవత్సరాల క్రితం ప్రభుత్వానికి రూ. 12 కోట్ల తో ప్రతిపాదనలు పంపినాము. నిదులు మంజూరు అయిన వెంటనే పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

శ్రీనివాసులు,ఇరిగేషన్ ఎఇ

చిత్రావతి వంతెనకు పోలీసుల మరమ్మతులు

గోరంట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూదిలివద్ద గల చిత్రావతి వంతెన దెబ్బతినే స్థితిలో ఉండగా సీఐ శేఖర్ ఆధ్వర్యంలో మట్టి తోలి బుధవారం మరమ్మత్తులు చేపట్టారు. ప్రస్తుతం వర్షాలకు వంతెన దెబ్బతిన్న విషయాన్ని పోలీసులు గుర్తించారు. కర్ణాటకలోని పరగోడు డ్యామ్‌నిండి బుధవారం నీరు రహదారిపై ప్రవహిస్తోంది. ప్రస్తుతం పరగోడు డ్యామ్ నిండిన కారణంగా మళ్లీ వర్షాలు పడితే చిత్రావతి ఉధృతి వలన బూదిలి వంతెనకు ముంపు వాటిల్లే ప్రమాదముంది. సీఐ శేఖర్ వంతెనను సందర్శించి వెంటనే ట్రిప్పర్లద్వారా మట్టిని తరలించి మరమ్మతులు చేపట్టారు. సమీపంలోని బూదిలి తండా వద్ద ఇదే రహ దారి కోతకు గురికాగా, ప్రమాదాలు జరగకుండా కోసుకుపోయిన రోడ్డును పూడ్చివేయించారు. పోలీసులు రహదారిని మరమ్మత్తు చేయడంతో స్థానికులు అభినందించారు.


చిత్రావతి వంతెనను పరిశీలిస్తున్న సీఐ శేఖర్

తూతూమంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

- అనారోగ్యం పేరుతో ఐదే నిమిషాల్లో ముగింపు
- సమావేశం తీరుపై ప్రజల ఆగ్రహం

చిలమత్తూరు, అక్టోబరు 23: ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశం కేవలం ఐదే ఐదు నిమిషాల్లో ముగించేశారు. అభివృద్ధి పనులపై, ప్రజా సమస్యలపై చర్చ చేయకుండానే సభ్యులు సమావేశం నుంచి వెనుదిరిగారు. బుధవారం ఎంపీపీ పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్యసమావేశం తీవ్ర విమర్శలకు దారితీసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటగా జరిగిన ఈ సమావేశాన్ని అభివృద్ధి పనులపై చర్చ జరగకుండా ముగించేశారు.

- పదవులు కాపాడుకోవడానికే హాజరు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పడిన మండల పరిషత్ పాలకవర్గంలో మొత్తం వైసీపీకి చెందిన వారే ఉన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో ఎంపీపీ పురుషోత్తంరెడ్డికి వ్యతిరేకంగా ఏర్పడిన ఎంపీటీసీలు మరో వర్గంగా ఏర్పడి టీడీపీలో చేరారు. దాంతో ఎంపీపీ పురుషోత్తంరెడ్డి వర్గంలో కేవలం ఏడుగురు సభ్యులే ఉన్నారు. ఈ తరుణంలో ఈ ఏడాది జులై నెల 24న ఏర్పాటు చేసిన సమావేశానికి సభ్యులు ఎవ్వరూ హాజరు కానందున ఆ రోజున సమావేశాన్ని 27కి వాయిదా వేశారు. అయితే 27వ తేదీ కూడా సభ్యులు ఎవ్వరూ హాజరుకానందున సమావేశాన్ని దీర్ఘకాలంగా వాయిదా వేశారు. దీంతో మూడోసమావేశం బుధవారం ఏర్పాటుచేయడంతో ఈ సమావేశానికి ఎంపీపీ తప్పక హాజరుకావాల్సి ఉంది. దాంతో ఈ సమావేశం కేవలం వారి పదవులు నిలుపుకునేందుకే జరిగిందా? అనే అనుమానం ప్రజల్లో కలుగుతోంది.

- అనారోగ్యం పేరుతో ఐదు నిమిషాల్లో ముగింపు

రెండు సార్లు రాజకీయ కారణాలతో సమావేశం జరపలేకపోయిన ఎంపీపీ ఇప్పుడు తన అనారోగ్యం కారణంగా ఈ సమావేశాన్ని ముగిస్తున్నామని కేవలం ఐదు నిమిషాల్లో సమావేశాన్ని ముగించేశారు. చర్చించాల్సిన అంశాలు ఉన్నా ఆ దిశగా చర్చించకుండానే ముగిస్తున్నట్లు ప్రకటించడంపై సభకు హాజరైన ఎంపీటీసీలు, సర్పంచులు ఖంగుతిన్నారు. మూడు నెలలుకు ఒకసారి నిర్వహించే సమావేశంలో కూడా సమస్యలపై చర్చించకపోవడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు. పాలకవర్గంలో 14 మంది సభ్యులుండగా వారిలో కేవలం 8 మంది మాత్రమే సమావేశానికి హాజరవడం విశేషం. సమావేశాల సందర్భంగా సభను అడ్డుకునే ప్రయత్నం చేసిన ఎంపీటీసీలను దృష్టిలో పెట్టుకొని బుధవారం జరిగిన సమావేశానికి గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.


మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి

అధికారులు లేక సమావేశం వెలవెల



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సోమందేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సర్వసభ్య సమావేశం బుధవారం తూతూ మంత్రంగా జరిగింది. ప్రజా సమస్యలపై వాడివేడి చర్చలతో కొనసాగాల్సిన సమావేశం అధికారులు లేక వెలవెల బోయింది. ప్రధానశాఖల అధికారులు హాజరు కాకుండా తమ తరపున సిబ్బందిని పంపి చేతులు దులుపుకున్నారు. కూటమిప్రభుత్వం కొలువుతీరడంతో వైసీపీ ప్రజాప్రతినిధులు ఎక్కువగా ఉండటంవల్ల సమావేశంలో ఎలాంటి చర్చలు లేకుండా చప్పగా సాగింది. అధికారులు రకరకాల సాకులతో సమావేశాలకు రాకపోవడంతో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైంది. ఇప్పటికైనా అర్థవంతమైన చర్చలు చేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మమతదేవి, డీటీ రెడ్డిశేఖర్, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

చేరికలు పెరుగుతున్నాయి: ఎమ్మెల్యే

మడకశిర టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. ఆయనపై నమ్మకంతో పార్టీలోకి చేరికలు పెరుగుతన్నాయని అన్నారు. గౌడనహళ్లి పంచాయతీ పరిధిలో 60 వైసీపీ కుటుంబాలు టీడీపీలో బుధవారం చేరాయి. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి వారిని ఎమ్మెల్యే ఆహ్వానించారు. వైసీపీ నాయకులు బుడ్డప్ప, జయరామప్ప, ఫక్రుద్దీన్, సోమశేఖర్, రామాంజనేయులు, అంజనేయులు, చిత్రశేఖర్, హనుమంతరాయప్ప, తిప్పేస్వామి తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. వారందరికీ నాయకులు తెలుగుదేశం కండువాలు వేసి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

అగళి: మడకశిర నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చడమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నారు. ఇందుకోసం తాలుకాలో వంద బోర్లు తవ్వడానికి చర్యలు చేపట్టామన్నారు. అనంతరం గ్రామాలలో వేసిన బోరుబావులకు బటన్ నొక్కి నీటిని విడుదల చేసి ప్రారంభించారు. పూలపల్లిలో వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించారు. సర్పంచులు నరసింహమూర్తి, లక్ష్మమ్మ, లింగరాజు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు శ్రీనివాసులు, రవికుమార్, శివన్న, తురకవాండ్లపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు బుడ్డప్ప, జయరాం, ఫక్రుద్దీన్ తదితర పది కుటుంబాలవారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.


టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

కొత్త ప్రభుత్వంతో వెలుగులు



మడకశిర టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీ ఏరియాలో గత ప్రభుత్వంలో వీధిదీపాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రభుత్వం మారి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి వార్డులోనూ వీధి దీపాలు ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు చేపట్టారు. పట్టణంలోని 19, 20వ వార్డులలో బుధవారం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామిలు సూచించడంతో అధికారులతో కలిసి పార్టీ నాయకులు ప్రతి స్తంభానికి వీధి దీపాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. టీడీపీ నియోజకవర్గం మీడియా కోఆర్డినేటర్ రవికుమార్, నాయకులు భూతరాజు, చిన్నప్ప, అధికారులు తదితరులు పాల్గొన్నారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

సోమందేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో తల్లిదండ్రులు మందలించారని మనస్థాపం చెంది ఇంటి నుంచి అలిగి సోమందేపల్లి చేరిన బాలుడిని పోలీసులు అతడి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. మంజునాథ్, భారతి దంపతులు ధర్మవరం వైఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్నారు. వారి కుమారుడు గౌతమ్ (14) తనను మందలించారనే కోపంతో బుధవారం ఇంటి నుంచి పారిపోయాడు. సోమందేపల్లికి చేరుకోగానే హోమ్‌గార్డ్ హరి గమనించి బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లాడు. విచారించిన ఎస్‌ఐ రమేష్ వివరాలు రాబట్టి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. పిల్లలపట్ల సున్నితంగా వ్యవహరించాని, వారిని కోపంగా కాకుండా ప్రేమతో మందలించాలని తల్లిదండ్రులకు నచ్చజెప్పి బాలుడిని తిరిగి అప్పగించాడు.

ఘనంగా జన్మదిన వేడుకలు


జన్మదిన కేక్‌కట్‌చేస్తున్న జయప్ప

లేపాక్షి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల కన్వీనర్ జయప్ప జన్మదిన వేడుకలను బుధవారం ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. హిందూపురం నియోజకవర్గం నుంచి ఇతర ప్రాంతాల నుండి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌కట్‌చేసి మిఠాయిలను పంచుకున్నారు. సుఖసంతోషాలతో వర్థిల్లాలని మున్ముందు పార్టీలో మరిన్ని పదవులు అర్జించాలని ఆయనను అందరూ ఆశీర్వదించారు.

డీలర్ల సంఘం అధ్యక్షునిగా గోపాల్‌రెడ్డి

హిందూపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : హిందూపురం రూరల్ మండలం చౌకధాన్యపు డీలర్ల సంఘం అధ్యక్షునిగా నక్కలపల్లికి చెందిన టీడీపీ నాయకుడు గోపాల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం హిందూపురం మండలంలోని 14పంచాయతీలకు సంబంధించి చౌకధాన్యపు డీలర్లు కొటిపిలో సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి టీడీపీ మండల కన్వీనర్ అశ్వర్థనారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఆదినారాయణ, నాయకులు హెచ్‌ఎన్‌రాము, ఉమాశంకర్‌రెడ్డి, రామక్రిష్టారెడ్డి, మంజునాథ్, చిక్కీరప్ప, చిన్నారెడ్డిలు హాజరయ్యారు. వీరి సమక్షంలో డీలర్లు గోపాల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఆయనకు నాయకులు శుభాకాంక్షలుతెలిపారు.

చేనేతకు చేయూత


నేతన్నను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

సోమందేపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని దుర్గానగర్‌కు చెందిన చేనేత కార్మికుడు రంగన ఉపేంద్రకు తొగటవీరక్షత్రియ సంఘం నాయకులు సీసీ హరి బుధవారం చేయూతనందించారు. అనారోగ్యంతో బాధపడుతూ కాలికి చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా అతడిని పరామర్శించారు. అనంతరం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. పూజారి ఈశ్వరయ్య, బండారు శివ, బండారు శ్రీనివాసులు, శంకర్, ఈశ్వర్, జక్కారాము, కందికుంట నవీన్‌లు పాల్గొన్నారు.

యువనేతకు పరామర్శ

ఇటీవల ద్విచక్రవాహన ప్రమాదంలో గాయపడిన టీడీపీ యువనేత పోతుల ప్రసాద్‌ను బుధవారం టీడీపీ నాయకులు అతన్ని పరామర్శించారు. సీసీహరి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. పార్టీ అండగా ఉంటుందన్నారు.

సత్తా చాటిన రవీంద్ర పాఠశాల విద్యార్థులు

గుడిబండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గుడిబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన క్రీడా పోటీల్లో గుడిబండ రవీంద్రా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. కబడ్డీ తదితర పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో రవీంద్ర పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మునిప్రతాప్, ప్రధానోపాధ్యాయుడు గోవిందప్ప, రవీంద్రా పాఠశాల యాజమాన్యం ప్రతినిధులు చిత్తయ్య, రాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.